# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 94 | విశాఖపట్నం | 3-1-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 94 | VISAKHAPATNAM | 3-1-2026 SATURDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## మచిలీపట్నం పోర్టుని ఏడాదిలో
# పూర్తి చేస్తాం: రవీంద్ర



**మచిలీపట్నం, పతాకం న్యూస్:** మచిలీపట్నం పోర్టు ఒక సంవత్సరంలో పూర్తి అవుతుందని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. పోర్టు కనెక్టివిటీ కోసం రోడ్ల నిర్మాణం చేయాల్సి ఉందని పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లాలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. దాదాపు రూ.400 కోట్లతో పోర్టు కనెక్టివిటీ రోడ్డుకు శ్రీకారం చుట్టాలని అనుకుంటున్నామని తెలిపారు మంత్రి కొల్లు రవీంద్ర. పోర్టు కనెక్టివిటీ రోడ్డుకు ఎక్కడ ఫ్లైఓవర్, అండర్ పాసులు ఉండాలో అధికారులు ప్రణాళికలు వేస్తున్నారని చెప్పుకొచ్చారు. మచిలీపట్నం, విజయవాడ జాతీయ రహదారిని 6 లైన్లుగా విస్తరించాలని తమ ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇందుకోసం రూ. 2 వేల కోట్లు ఖర్చువుతాయని వివరించారు. అవుటర్ రింగ్ రోడ్డుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. విజయవాడ నుంచి గోశాల వరకు రోడ్డు విస్తరణ చేయాలని ఆలోచన చేస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి కొల్లు రవీంద్ర. (తరువాయి 2వ పేజీలో)

## భూ వివాదాల పరిష్కారమే ప్రభుత్వ
# ప్రథమ కర్తవ్యం: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** రాజముద్రతో అన్నదాతలకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నూతన సంవత్సర కానుక అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీవ్యాప్తంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపణీపై ముఖ్య మంత్రి (శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రికి రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా మత్రులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఒకరోజు పాల్గొంటానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి ఫొటోలతో భూమి హక్కు పత్రాలను పంపిణీ చేశారని ధ్వజమెత్తారు. నాటి ప్రభుత్వ చర్యలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. తాము అధికారంలోకి రాగానే రీ సర్వే చేసి తప్పులను సరిదిద్ది కొత్త పాసుపుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. రీ సర్వే పూర్తైన గ్రామాల పరిధిలో 22 లక్షల కొత్త పాసుపుస్తకాల పంపిణీని ప్రారంభించామని పేర్కొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏపీ వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. వేలాది గ్రామాల్లో సంబరంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ మొదలైందని తెలిపారు. జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాల స్థానంలో రాజముద్ర ఉన్న వాటిని పంపిణీ చేస్తోండటంతో ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ప్రతి గ్రామంలో రెవెన్యూ సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని అన్నారు. వివాదాలు లేని స్థలాలను కూడా రీ సర్వే పేరుతో అడ్డదిడ్డంగా చేసి వివాదాస్పదం చేశారని మండిపడ్డారు. భూమే ప్రాణంగా బతికే రైతన్నలకు భూ సమస్యలు లేకుండా చేయడం మన లక్ష్యమని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామని తెలిపారు. నేడు పాసుపుస్తకాల పంపిణీ ప్రతి ఇంట్లో కొత్త సంతోషాన్ని తెస్తోందని అన్నారు. పాసుపుస్తకాలపై తమ బొమ్మలకు నాటి పాలకులు రూ.22 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ప్రజలకు భూ వివాదాలు లేకుండా చేయడం మన ప్రథమ కర్తవ్యం కావాలని సూచించారు. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్థిష్ట సమయాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు.

# రైతుల సంక్షేమం కోసమే పని చేస్తున్నాం: డోలా



**ప్రకాశం, పతాకం న్యూస్:** శుక్రవారం పొన్నలూరు మండలం వెల్లటూరు గ్రామంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూ సమస్యల్ని పరిష్క రించ డానికి ప్రభుత్వం రీ సర్వే చేపట్టి రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తోంది. కొండేపి నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ క్లినిక్ లు ఏర్పాటు చేస్తాం అని ఆయన హామీనిచ్చారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుంది అని అన్నారు. అలాగే నేడు ఒంగోలులో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పాల్గొన్నారు.

# జోగి రమేశ్‌కు మళ్లీ కస్టడీ... భార్య, కుమారుడికి నోటీసులు

**విజయవాడ, పతాకం న్యూస్:** నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ కు సంబంధించిన దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న జోగి రమేశ్, ఆయన సోదరుడు రాములును ప్రత్యేక దర్యాప్తు బృందం మరోసారి కస్టడీలోకి తీసుకుంది. శుక్రవారం ఉదయం వారిద్దరినీ అధికారికంగా కస్టడీలోకి తీసుకున్న సిట్ అధికారులు, మూడు రోజుల పాటు లోతైన విచారణ చేపట్టనున్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో నకిలీ మద్యం తయారీ, సరఫరాకు సంబంధించిన కేసులో ఇప్పటికే జోగి బ్రదర్స్‌ను సిట్ అధికారులు ఒకసారి ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే అప్పటి విచారణలో వెలుగులోకి రాని కీలక అంశాలు, మరికొందరు వ్యక్తులతో ఉన్న సంబంధాలు, నిధుల లావాదేవీలపై స్పష్టత కోసం రెండోసారి కస్టడీ అవసరమని అధికారులు భావించినట్లు తెలుస్తోంది.



# పర్యాటకులకు సరికొత్త అనుభూతి
## త్వరలో హౌస్ బోటింగ్ ప్రారంభం



**అమరావతి, పతాకం న్యూస్:** పర్యాటక రంగం ఇక కొత్త పుంతలు తొక్కనుంది. పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచే హౌస్ బోటింగ్ ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చనుంది. విజయవాడ సమీపంలోని జి.కొండూరులో పర్యాటక పడవను తయారు చేస్తున్నారు. బాపట్ల మండలం ఆదర్శనగర్ వద్ద పేరలి కాలువ నుంచి నల్లమడ వాగు, ఉప్పుటేరు మీదుగా తూర్పు తుంగభద్ర కాలువలో నిజాంపట్నం హార్బర్ సమీపం వరకు పడవలు తిరిగే మార్గాన్ని ఖరారు చేశారు. హౌస్ బోట్లు నిలపటానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు కేటాయించింది. సూర్యలంకకు పర్యాటకులను మరింతగా ఆకర్షించడానికి మూడు హౌస్‌బోట్లు తిప్పేలా ప్రైవేటు ఆపరేటర్లతో పర్యాటక శాఖ ఒప్పందం చేసుకుంది. రాబోయే కొద్ది నెలల్లో ఓ పడవ నిర్మాణం పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. రెండు, మూడు హౌస్ బోట్ల నిర్మాణానికి తూర్పు బాపట్ల, పిన్నిబోయినవారిపాలెం సమీప నల్లమడ వాగు ఒడ్డున స్థలాల్ని కలెక్టర్ వినోద్‌కుమార్ కేటాయించారు. త్వరలో వీటి నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ఉగాది నాటికి మొదటి హౌస్‌బోటు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. పేరలి కాలువ, నల్లమడ వాగు కట్టలపై పొగురు వరకు నాలుగు కి.మీ. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, ఆదర్శనగర్, పొగురు, తుమ్మలపల్లి, నిజాంపట్నం హార్బర్ సమీపంలో నాలుగు ల్యాండింగ్ పాయింట్లలో పడవలు నిలపడానికి జెట్టీల నిర్మాణం, విద్యుత్తు సౌకర్యం కల్పించే పనులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే టెండర్ ఖరారు చేశారు. సూర్యలంకలో రూ.97.52 కోట్లతో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల్లో భాగంగా దీనిని చేపడుతున్నారు. బీచ్ ఒడ్డున నిర్మాణాలు ఇటీవలే మొదలుపెట్టి వేగంగా చేస్తున్నారు. దీనికి అనుబంధంగా ప్రముఖ హోటళ్లు, ఆతిథ్య సంస్థలు, పెట్టుబడిదారులు రూ.వందల కోట్లు వెచ్చించి కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ, తీర ప్రాంతం జిల్లాకు గొప్ప వరమన్నారు. సూర్యలంక, పాండురంగాపురం, వాడరేవు, రామాపురం బీచ్‌లు ప్రముఖ పర్యాటక స్థలాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. పర్యాటక జోన్లుగా విభజించి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. హౌస్‌బోట్ల ప్రాజెక్టు అలెప్పీ తరహాలో పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకుంటుందని వివరించారు. మరోవైపు విజయవాడలోని కృష్ణా నదిలో పర్యాటకం ఇకపై రాత్రి వేళల్లోనూ కళకళలాడనుంది. ఇక్కడ రెండు భారీ లగ్జరీ బోట్లను నడిపేందుకు రంగం సిద్ధమైంది. కేరళకు చెందిన ఒక ప్రముఖ సంస్థ, మన రాష్ట్రానికి చెందిన మరో సంస్థతో కలిసి ఉమ్మడి భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి.


పతాకం న్యూస్ APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

APTEL/25/A2082
పతాకం న్యూస్
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)

ప్రభుత్వం రూపొందించే విధానాలకు ఒకటి లేదా అంతకు మించిన లక్ష్యాలు ఉంటాయి. వైద్య విద్యలో అనుసరించదలిచిన ప్రభుత్వ-ప్రైవేటు-భాగస్వామ్యం (పి.పి.పి) విధానానికి కూడా చాలా లక్ష్యాలు ఉండొచ్చు. అందుబాటులో ఉండే ఫీజులో నాణ్యమైన వైద్య విద్యకు అవకాశం కల్పించడం, పెట్టుబడిదారుడికి తగినన్ని లాభాలు సమకూర్చడం, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ప్రజలకు సంకేతాత్మకంగా ప్రచారం చెయ్యడం, కోట్లాది రూపాయల ఈ బడా కాంట్రాక్టుల ద్వారా పై డబ్బులు దండుకోవడం ఇలా చాలా అవకాశాలు ఉంటాయి. కాబట్టి లక్షిత విధానానికి అనుగుణంగా పాలసీ విధివిధానాలు రూపొందిస్తారు. మూడేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ఆరు వైద్య కళాశాలలను నెలకొల్పాలని నిర్ణయించింది. దీనితో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 17కి పెరుగుతుంది. ప్రైవేటు రంగంలో 19 వైద్య కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరో 10 వైద్య కళాశాలలను పి.పి.పి పద్ధతిన నెలకొల్పాలని భావిస్తున్నది. ఈ కళాశాలలు అందుబాటులోకి వస్తే కొత్తగా 6500 సీట్లు లభిస్తాయి. ఈ ప్రతిపాదిత 10 వైద్య కళాశాలలకుగాను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 835 ఎకరాల భూమి సేకరించింది. అలాగే ఈ కళాశాలల నిర్మాణం వివిధ దశలలో ఉన్నది. సగటున ఒక్కో వైద్య కళాశాల స్థాపనకు 450 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 4500 కోట్ల రూపాయల నిధులు అవసరమవుతాయి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, నాబార్ట్ రుణాలతో ఈ నిధులు సమకూరుతాయి. ప్రతి వైద్య కళాశాలలో 150 ఎం.బి.బి.ఎస్ సీట్లు, దానికి అనుబంధంగా 650 పడకల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి భవిష్యత్తులో మరింత సామర్థ్యం పెంచుకునే అవకాశంతో అందుబాటులోకి వస్తాయి. సాధారణంగా ప్రభుత వైద్య కళాశాలలో ఫీజు రాయితీ కల్పిస్తారు. అయితే ఆర్థిక నిర్వహణ భారం కాకుండా ఉండడానికి ప్రభుత్వం మూడంచెల ఫీజులు నిర?యించింది. 50 శాతం సీట్లు ఏడాదికి 15,000 రూపాయల ఫీజు చొప్పున, 35 శాతం సీట్లు 12 లక్షల ఫీజు చొప్పున, 15 శాతం సీట్లు ఎన్నారైలకు 20 లక్షల ఫీజు చొప్పున వసూలు చేస్తే ఏడాదికి ఒక్కో బ్యాచ్ నుండి 11 కోట్ల ఆదాయం లభిస్తుంది. ఐదేళ్ల కోర్సు పూర్తయ్యేసరికి 55 కోట్ల ఆదాయం వస్తుంది. వీటికి తోడు కాలేజీలో విద్యా బోధన మొదలయిన రెండవ ఏడాదిలో 28 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు లభిస్తాయి. ఇవి 50 వరకు పెరిగే అవకాశం ఉన్నది. ఈ సీట్ల ఫీజు ఎం.బి.బి.ఎస్ ఫీజులకు మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది. 2024లో ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం విద్యా రంగ ప్రైవేటీకరణే లక్ష్యంగా పెట్టుకున్న నీతి ఆయోగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం 11 వైద్య కళాశాలలను పి.పి.పి పద్ధతిన నిర్వహించడానికిగల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చెయ్యడానికి కె.పి.యం.జి ని నియమించింది. పి.పి.పి పద్ధతిన కళాశాల, జిల్లా ఆసుపత్రుల నిర్వహణకు అవసరమయ్యేంత భూమిని ఎకరాకు 100 రూపాయల చొప్పున 33 ఏళ్లకు (దాన్ని మరో 33 ఏళ్లకు పొడిగించుకునే వెసులుబాటుతో) లీజుకు ఇవ్వాలి. అలాగే ప్రాజెక్టు వ్యయంలో ప్రభుత్వం 25 శాతం వాటా 'వయబిలిటీ ఫండింగ్' పేరిట సమకూర్చాలి. రాష్ట్ర ఆరోగ్య బీమా సదుపాయం కింద సేవలు అందించే ఆసుపత్రిగా ప్యానల్‌లో చేర్చాలి. జాతీయ వైద్య కమిషన్ తదితర సంస్థల నుండి అనుమతులు తెచ్చి పెట్టాలి. అలాగే 70 శాతం పడకలు నిండేందుకు హామీ పడాలి. ఇందుకు ప్రతిగా పెట్టుబడి పెట్టే సంస్థ రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలి. అలాగే ఔట్ పేషెంట్లకు ఉచిత వైద్య సేవలు అందించాలి. 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా' కింద ప్రభుత్వం సిఫార్సు చేసే పేషెంట్లకు 70 శాతం పడకల ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలి. మిగిలిన 30 శాతం పడకలకు సంబంధించి మార్కెట్ రేటుకు వైద్యం చేసుకోవచ్చు. నిర్దిష్ట గడువు పూర్తయ్యేలా పర్యవేక్షించడానికి ప్రభుత్వం ఒక ఇంజనీరుని నియమించాలి. జన ఔషధి ఫార్మసీకి, మెడికో లీగల్ కేసుల నిమిత్తం చెరి 500 చదరపు అడుగుల నిర్మాణాన్ని పూర్తి చేసి అందించాలి. పి.పి.పి విధానంపై పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు వెల్లువెత్తాయి. ప్రజల ఆస్తులుగా ఉండాల్సిన జిల్లా ఆసుపత్రులను ప్రైవేటీకరిస్తున్నారన్న విమర్శలు చెలరేగాయి. మధ్య తరగతి, పేద విద్యార్థులకు వైద్య విద్యావకాశాలు సన్నగిల్లుతాయని, ప్రభుత్వ ఉద్యోగాలు హరించుకుపోతాయనే ఆందోళన నెలకొనిఉన్నది. ప్రైవేటు పెట్టుబడిదారులు రిక్రూట్‌మెంట్‌లో కోటా విధానాన్ని పాటిస్తారనిగానీ, జేబు ఖర్చులకు ఇచ్చే అలవెన్సులు చెల్లిస్తారని కానీ గ్యారంటీ ఉండదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## తిరుమలలో పోటెత్తిన భక్తులు - సామాన్యులకు వైకుంఠ ద్వార దర్శనం



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనం ప్రశాంతంగా సాగుతోంది. మొదటి 3 రోజులు ఎస్ఎస్‌డీ టోకెన్లు కలిగిన వారికి ప్రాధాన్యతనిచ్చిన టీటీడీ ఈ రోజు నుంచి నేరుగా వచ్చిన భక్తులను అనుమతిస్తోంది. వేకువజామున తిరుప్పావై సేవ అనంతరం సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఆక్టోపస్ భవనం పాయింట్ నుంచి నారాయణగిరి ఉద్యానవనంలోని క్యూలైన్ల ద్వారా భక్తులను వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 లోని కంపార్ట్‌మెంట్లకు తరలివస్తున్నారు. ఎలాంటి టోకెన్లు లేకుండా వైకుంఠద్వార దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకొనేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ సీవీఎస్ఓ మురళీకృష్ణ తెలిపారు. పాచికాల్వ గంగమ్మ ఆలయం నుంచి నారాయణగిరి ఉద్యానవనంలో ఎర్పాటు చేసిన షెడ్ల వరకు దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశామని అన్నారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ వైకుంఠ ద్వార సర్వదర్శనానికి వెళ్లాలనుకొనే భక్తులను క్యూలైన్ ప్రారంభ ప్రాంతానికి ఉచిత బస్సుల ద్వారా తరలిస్తున్నట్లు తెలిపారు. అన్నప్రసాదాలు, పాలు, నీళ్లు వంటి పానీయాలను నిరంతరం భక్తులకు అందిస్తూ దర్శనానికి అవకాశం కల్పిస్తామని సీవీఎస్ఓ వెల్లడించారు. టీటీడీ ఆధ్వర్యంలోని ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన రైడాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో వంగల హర్షవర్ధన్.. శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్ రూ.10 లక్షలు విరాళంగా అందించారు. గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ డైరెక్టర్ నేలబొట్ల శుభ సౌజన్య శ్రీ బాలాజీ ఆరోగ్యం వరప్రసాదిని స్కీంనకు రూ.10 లక్షలు అందజేశారు. ఈ మేరకు రూ. 20 లక్షల డీడీలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు ఆ సంస్థల ప్రతినిధుల తరుపున తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ అందజేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిపై అచంచలమైన భక్తితో టీటీడీ ట్రస్టులకు భక్తులు విరాళాలు అందించడం పట్ల బీఆర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

## ఉపాధి హామీపై కేంద్రం కుట్ర: షర్మిల



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంపైనా, కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ) కేంద్రం కుట్రలు చేస్తుంటే, సీఎం చంద్రబాబు మౌనంగా ఉండటం దారుణమని ఆమె మండిపడ్డారు. బీజేపీ తెస్తున్న నల్ల చట్టాలకు రాష్ట్ర ప్రభుత్వం చప్పట్లు కొట్టడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు. షర్మిల మాట్లాడుతూ, "గ్రామీణ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఊతమిచ్చింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో దేశంలోనే తొలి జాబ్ కార్డును మన రాష్ట్రంలోనే అందించాం. ఈ పథకం ద్వారా ఏటా 80 లక్షల మంది పేదలకు ఉపాధి హక్కుగా మారింది" అని వెల్లడించారు. దేశంలోనే ఈ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుంటున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని తెలిసినా, కేంద్రం 'జీ రామ్ జీ' పేరుతో కొత్త చట్టం తీసుకొచ్చి దానికి గండి కొడుతోందని ఆరోపించారు. ఈ అక్రమ చట్టంతో రాష్ట్రంపై ఏటా రూ.4,500 కోట్ల భారం పడుతుందని, ఈ నిజాన్ని తెలిసి కూడా చంద్రబాబు ఏమీ మాట్లాడకుండా ఉండడం బాధాకరమన్నారు. "గోరుచుట్టుపై రోకలి పోటులా ఈ కొత్త చట్టం మారింది. ఇప్పటికే ప్రతినెలా జీతాలు ఇవ్వడానికే అప్పులు చేసే ప్రభుత్వం, ఈ పథకానికి అవసరమైన 40 శాతం నిధులను ఎక్కడి నుంచి తెస్తుంది?" అని షర్మిల ప్రశ్నించారు. నిరుద్యోగంలో నంబర్ వన్ గా ఉన్న రాష్ట్రంలో ఉపాధికి ఉరి పెడుతుంటే ప్రజలకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. "మీరు రాష్ట్రానికి ముఖ్యమంత్రా లేక మోదీ చేతిలో తోలుబొమ్మనా?" అని చంద్రబాబును ఉద్దేశించి ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఉపాధి హామీ పథకానికి ఊపిరి తీస్తున్న 'జీ రామ్ జీ' చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కూటమి పార్టీలను ఆమె కోరారు. పాత నరేగా చట్టాన్ని పునరుద్ధరించేలా బేషరతుగా మద్దతు పలకాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, కూటమి పార్టీల నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఎండగడుతుందని షర్మిల హెచ్చరించారు.

## గంజాయితో పట్టుబడ్డ ముగ్గురు యువకులు



**గొలుగొండ, పతాకం న్యూస్:** గంజాయి అక్రమ రవాణా వినియో గంపై ఉక్కుపాదం మోపుతున్న జిల్లా పోలీసు యంత్రాంగం తాజాగా అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో అందిన పక్కా సమాచారం మేరకు రూరల్ సీఐ రేవతమ్మ సూచనలతో గొలుగొండ ఎస్సై పి. రామారావు శుక్రవారం తన సిబ్బందితో కలిసి ఏటిగైరంపేట శివారులో తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దవునూరు వైపు నుండి నర్సీపట్నం వస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వారిని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న బ్యాగులో 2 కేజీల గంజాయి లభ్యమైంది.పోలీసుల విచారణలో నిందితులు ఒడిశా నుండి గంజాయిని కొనుగోలు చేసి సొంతంగా వినియోగించుకోవడానికి తీసుకువెళ్తున్నట్లు అంగీకరించారు. వీరికి గంజాయి సేవించే అలవాటు ఉందని గతంలో కూడా వీరిపై గంజాయి కేసులు నమోదై అరెస్ట్ అయినట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన నిందితుల వివరాలు దాసరి ప్రశాంత్ కుమార్ (30), పెదవేగి, ఏలూరు జిల్లా,తుపాకుల హరీష్ కుమార్ (22), ఏలూరు టౌన్,కొవ్వూరి సుమంత్ (25), విజయరావు గ్రామం ఏలూరు జిల్లా.ముగ్గురు నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

## గిగ్ వర్కర్లు కనీసం 90 రోజులు పనిచేయాల్సిందే

### గిగ్ వర్కర్ల నిబంధనలపై కేంద్రం ముసాయిదా



**తిరుపతి, పతాకం న్యూస్:** గిగ్ వర్కర్లు ఒక ఏడాదిలో కనీసం 90 రోజులు పనిచేస్తేనే వారికి సామాజిక భద్రత ప్రయోజనాలు లభిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. మెరుగైన వేతనాలు, సోషల్ సెక్యూరిటీ బెనిఫిట్స్ కల్పించాలని గిగ్ వర్కర్లు డిమాండ్ చేస్తూ గత నెల రెండు సార్లు సమ్మెకు దిగిన నేపథ్యంలో కేంద్రం తాజాగా ఓ ముసాయిదాను విడుదల చేసింది. అందులో ఒక ఆర్థిక సంవత్సరంలో గిగ్ వర్కర్లు ఒక అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు పనిచేయాలని, వేర్వేరు అగ్రిగేటర్ల వద్దనైతే కనీసం 120 రోజులు పనిచేయాల్సి ఉంటుందని ప్రతిపాదించింది. కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ స్టేక్ ల్డర్స్ అభిప్రాయాలను కోరుతూ గురువారం 4 లేబర్ కోడ్స్‌పై ముసాయిదా నిబంధనలను ముందస్తుగా ప్రచురించింది. వేతనాల కోడ్-2019, పారిశ్రామిక సంబంధాల కోడ్-2020, సామాజిక భద్రత కోడ్-2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్-2020 ఉన్నాయి. 2026 ఏప్రిల్ 1 నాటికి దేశవ్యాప్తంగా ఒకేసారి వీటిని పూర్తిగా అమలులోకి తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. ఒక గిగ్ వర్కర్, ఒక అగ్రిగేటర్ వద్ద ఒక రోజంతా పనిచేస్తే, సంపాదించిన ఆదాయంతో సంబంధం లేకుండా, అతను ఒక రోజు పనిచేసినట్లుగా పరిగణిస్తారు. ఒకవేళ ఒక గిగ్ వర్కర్, వేర్వేరు అగ్రిగేటర్ల వద్ద పనిచేస్తే, అతని పనిదినాలను అందరు అగ్రిగేటర్లతో కలిపి లెక్కిస్తారు. ఒక గిగ్ వర్కర్ ఒక నిర్దిష్ట క్యాలెండర్ రోజున ముగ్గురు అగ్రిగేటర్లతో పనిచేస్తే, అప్పుడు అతను మూడు రోజులు పనిచేసినట్లు లెక్కిస్తారు. వాస్తవానికి మన దేశంలో కార్మిక రంగం ఉమ్మడి జాబితాలో ఉంది. అందుకే లేబర్ కోడ్‌లపై కేంద్రం, రాష్ట్రాల అభిప్రాయాన్ని కోరింది. ముఖ్యంగా పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020పై అభిప్రాయాలు తెలిపేందుకు 30 రోజుల సమయం, మిగిలిన 3 కోడ్‌లపై అభిప్రాయాలు తెలిపేందుకు 45 రోజుల సమయం ఇచ్చింది. దీనిపై సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ స్పందిస్తూ, "4 కార్మిక కోడ్?లకు సంబంధించిన ముసాయిదా నిబంధనల విడుదల, భారతదేశ కార్మిక సంస్కరణలను అమలు చేయడంలో ఒక కీలక ముందడుగు" అని అన్నారు. "నిబంధనలు అమలు చేయడానికి స్పష్టమైన, ఆచరణాత్మకమైన మార్గాలను అందించడం వల్ల స్థిరమైన దేశాభివృద్ధికి మద్దతు లభిస్తుందని, అదే సమయంలో కార్మికుల రక్షణను బలోపేతం చేస్తుందని" ఆయన అన్నారు. 'ప్రస్తుతం దేశంలో 94 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తున్నాం. 2026 మార్చి నాటికి 100 కోట్ల మంది కార్మికులకు సోషల్ సెక్యూరిటీ ప్రయోజనాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది" అని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖా మంత్రి మన్?సుఖ్ మాండవీయ అన్నారు. కాగా 2015 నాటికి దేశంలో సామాజిక భద్రత కేవలం 19 శాతం మంది కార్మికులకు అందించగా, 2025 నాటికి ఇది 64 శాతానికి పైగా పెరిగిందని ఆయన అన్నారు. అయితే కార్మిక రంగం ఉమ్మడి జాబితాలో ఉన్నందున, దేశవ్యాప్తంగా వీటిని పూర్తిగా అమలు చేయడానికి, కేంద్రంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ 4 లేబర్ కోడ్ నిబంధనలను నోటిఫై చేయాల్సి ఉంటుంది. లేబర్ కోడ్స్ ప్రతిపాదన ప్రకారం, ఇకపై కార్మికులను తప్పనిసరిగా నియామక పత్రం అందించాలి. 40 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సున్న కార్మికులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. వివిధ షిఫ్టుల్లో పనిచేయడానికి మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి.

## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దశాబ్దకాలంగా కొనసాగుతున్న , గోదావరి నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓ ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు. కృష్ణా గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) ఛైర్మన్లు, జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గతేడాది జులైలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని చర్చించారు. ఇటీవల డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం తమ ప్రతినిధులను నామినేట్ చేయడంతో కమిటీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. ఇరు రాష్ట్రాల మధ్య నీటిని సమానంగా పంచడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలు వంటి కీలక అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను సూచిస్తుంది. ఇదే సమయంలో, కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) గడువును కూడా కేంద్రం 2026 జులై వరకు పొడిగించింది.

## పూర్తి చేస్తాం: రవీంద్ర

(మొదటిపేజీ తరువాయి)

పెడన, గుడివాడ ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో హైవేకు సంబంధించి కొన్ని ప్రతిపాదనలు చెప్పారని ప్రస్తావించారు. కత్తిపూడి, ఒంగోలు జాతీయ రహదారి 350 కిలోమీటర్లు ఉంటుందని వెల్లడించారు. ఈ రహదారికి తీర ప్రాంత గ్రామాలు తాళ్లపాలెం, గిలకలదిండి, కోడూరు ప్రాంతాలను కలపాలని ఎమ్మెల్యేలు చెప్పారని అన్నారు. తీర ప్రాంతాలను కలుపుతూ హైవే నిర్మాణం చేస్తే ఆయా గ్రామాల్లో కూడా అభివృద్ధి జరుగుతుందని వివరించారు మంత్రి కొల్లు రవీంద్ర. పామర్రు నుంచి చల్లపల్లి వరకు ఉన్న రహదారిని పీఎం గతి శక్తి ద్వారా అభివృద్ధి చేస్తామని తెలిపారు. 4 లైన్ల నుంచి 6 లైన్ల రహదారిని అభివృద్ధి చేసే క్రమంలో ఇప్పుడు ఉన్న సమస్యలు పరిష్కారం చేసేలా డీపీఆర్‌లో పెట్టాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారని అన్నారు. కంకిపాడు నుంచి గుడివాడ వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన చేశామని వెల్లడించారు. ఆయా ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయంటే దానికి అనేక కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించిన అధికారులు



**సబ్బవరం, పతాకం న్యూస్ :** సబ్బవరం మండలం గంగవరం గ్రామంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను, సిమెంట్ స్తంభాలను తొలగించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ, గంగవరం సర్వే నంబరు 38/3, 38/4లలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో ప్రభుత్వం ఈ భూమిని పేద రైతులను పంపిణీ చేసి డి.పట్టాలు మంజూరు చేసిందని చెప్పారు. అయితే పట్టాలు పొందిన వారు ఈ భూమిలో వ్యవసాయం చేయకుండా వేరే వ్యక్తులకు విక్రయించినట్టు ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా, పట్టాదారులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డి.పట్టాలను రద్దు చేసి, భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని, అయితే ఈ భూములను అక్రమంగా కొనుగోలు చేసిన వ్యక్తులు బోర్డును తొలగించి, చుట్టూ ఫెన్సింగ్ వేశారని పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు రావడంతో గురువారం ఎక్స్‌కవేటర్‌తో ఫెన్సింగ్, సిమెంట్ స్తంభాలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇది ప్రభుత్వం భూమి అని, ఇతరులు ఎవరైనా ఇందులోకి ప్రవేశించినా, ఆక్రమించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బీ.వీరయ్య, వీఆర్వో రాంబాబు, వీఆర్ఏ రమేశ్ పాల్గొన్నారు.

## జిల్లాలో 35 నుంచి 40 వరకూ తగ్గనున్న ప్రాథమిక పాఠశాలలు?

### ఐదుగురు విద్యార్థుల కంటే తక్కువ ఉంటే మూసివేత



**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిన ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. తొలిదశలో ఐదుగురి కంటే తక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలల (ఫౌండేషన్, బేసిక్)ను గుర్తించే పనిలో పడింది. జిల్లాలో ఐదుగురి కంటే తక్కువ మంది ఉన్న పాఠశాలలు 35 నుంచి 40 వరకూ ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి నివేదిక రూపొందించి విద్యా శాఖకు పంపనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాలల ఏర్పాటుకు సంబంధించి సంస్కరణలు తీసుకువచ్చారు. ఫౌండేషన్, బేసిక్, మోడల్, యూపీ, ఉన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా విభజన చేశారు. సంస్కరణల ఫలితంగా ఫౌండేషన్ పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు సమయంలో సమీపంలోని ప్రాథమిక పాఠశాలల నుంచి మూడు నుంచి ఐదు తరగతులను అక్కడకు తరలించారు. మరోవైపు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించే తల్లిదండ్రులు సంఖ్య పెరుగుతుంది. వీటన్నింటి ప్రభావంతో కొన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుతూ వచ్చింది. పద్మనాభం మండలం పెంట గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. అదే మండలం బర్లపేట, పెదగంట్యాడ మండలం మరడ దాసరిపేట, చినగదిలి ప్రభుత్వ బాలురు హోమ్ (జువెనైల్ హోమ్)లో ఒక్కొక్క విద్యార్థి మాత్రమే ఉన్నారు. మరడ దాసరిపేటలో గత ఏడాది ఉన్న విద్యార్థే కొనసాగుతుండగా ప్రస్తుత సంవత్సరంలో కొత్తగా ఎవరూ చేరలేదు. ఇద్దరు విద్యార్థులున్న పాఠశాలలు ఆరు ఉండగా, ముగ్గురు ఉన్నవి ఏడు ఉన్నాయి. ఐదుగురి కంటే తక్కువగా ఉన్న పాఠశాలలను ఈ ఏడాదే మూసివేసి అక్కడ చదివే పిల్లలను సమీపంలోని పాఠశాలలకు పంపుతారా? లేదా ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేంత వరకూ కొనసాగించి...జూన్ తరువాత మూసివేస్తారా? అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల చేరికలపై ఉపాధ్యాయులు, విద్యాశాఖ అప్రమత్తం కావాలని, తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

## "అరకులోయ" ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికలకు సెల్ఫ్‌డిఫెన్స్ శిక్షణ ప్రారంభం



**అరకులోయ, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకు వ్యాలీలో ప్రధానమంత్రి ఉషా అండర్ గైడ్ స్కీమ్‌లో భాగంగా బాలికలకు నెల రోజుల పాటు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులు బుధవారం నుంచి ప్రారం భమయ్యాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థినులు తమను తాము రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. కొండబాబు మాట్లాడుతూ సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ద్వారా శారీరక ఆరోగ్యాన్ని కూడా పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. పాండు కరాటే అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ మరియు ఎగ్జామినర్ బి. పాండురాజు ఈ నెల రోజుల పాటు విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవంలో భాగంగా కరాటేలో బేసిక్స్ పై విద్యార్థినులకు ఆయన శిక్షణ అందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వై. విజయలక్ష్మి, ఎం. అనిత కుమారి మాట్లాడుతూ విద్యార్థినులు ఈ సర్టిఫికెట్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఎస్. అప్పలస్వామి, అధ్యాపకురాలు కె. అంబికా తదితరులు పాల్గొన్నారు.


## చోడవరం షుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రాసింగ్ ప్రారంభించాలి





**చోడవరం, పతాకం న్యూస్:** గోవాడ షుగర్ ఫ్యాక్టరిని వెంటనే తెరిపించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం చోడవరంలలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో వైసీపీ నాయకులు మాట్లాడుతూ గోవాడ షుగర్ ఫ్యాక్టరిని తెరిపించకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఫ్యాక్టరీపై ఆధారపడిన రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటివరకు గోవాడ షుగర్ ఫ్యాక్టరికి చెరుకును సరఫరా చేసిన రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ అఖిలపక్ష సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు,మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్,మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ , వివిధ రాజకీయ పార్టీల నాయకులు,వివిధ వర్గాల కార్మిక సంఘం నాయకులు,వ్యవసాయ సంఘం నాయకులు,సిపిఐ సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు ఉద్యోగుల జీతాల్లో కోత?



**గాజువాక, పతాకం న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అంతా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకుంటే విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఉద్యోగులు మాత్రం ఉసూరుమంటూ కాలం గడిపారు. యాజమాన్యం నిర్దేశించిన ప్రకారం 100 శాతం ఉత్పత్తి తీసినా పాత సీఎండీ సక్సేనా ఉద్యోగులకు పూర్తి జీతాలు ఇవ్వకుండా కోత పెట్టారు. అవి కూడా ఒకటో తేదీన ఇవ్వకుండా చేశారు. ఆయన ఎంఓఐఎల్‌లో డిసెంబరు 31న పదవీ విరమణ చేశారు. అక్కడ వేడుకల కోసం ముందుగానే వెళ్లిపోయారు. నవంబరు నెల మాదిరిగానే డిసెంబరు నెలకు కూడా ఉత్పత్తి ఆధారిత జీతాలే ఇవ్వాలంటూ ఉత్తర్వులు ఇచ్చి వెళ్లిపోయారు. వాస్తవానికి డిసెంబరులో ఉద్యోగులు అనేకసార్లు లక్ష్యానికి మించి ఉత్పత్తి తీశారు. అయితే కొన్ని విభాగాల్లో తగిన వనరులు లేక అందుబాటులో ఉన్నంత మేరకు ఉత్పత్తి సాధించారు. దాంతో ఒక్కో విభాగానికి ఒక్కోలా జీతాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాల్లో పనిచేసే వారికి 96 శాతం ఇస్తున్నారని తెలిసింది. రోలింగ్ మిల్స్‌లో పనిచేసే వారికి 82 శాతమే ఇవ్వడానికి పత్రాలు తయారుచేశారు. నాణ్యమైన కోక్ అందుబాటులో లేక ఆ విభాగంలో పుషింగ్స్ తగ్గిపోతున్నాయి. దాంతో వాయువులు కూడా తక్కువగా వస్తున్నాయి. ఆ మేరకు రోలింగ్ మిల్స్ అన్నింటినీ కాకుండా ఒకసారి నాలుగు, మరోసారి ఐదు చొప్పున నడుపుతున్నారు. దాంతో అక్కడ 100 శాతం ఉత్పత్తి రాలేదు. పనిచేయడానికి ఉద్యోగులు ప్లాంటులోనే పూర్తి సమయం ఉన్నా, వాయువులు లేక వీలు కాలేదు. దానికి లక్ష్యం మేరకు ఉత్పత్తి లేదంటూ వారి జీతాల్లో కోత పెట్టారని ఉద్యోగ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విధానం రాజ్యాంగబద్ధం కాదని, డిపార్టుమెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ) ఫిర్యాదు చేశామని, అక్కడి నుంచి వివరణ కోరినా, ఇక్కడి సీఎండీ పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో వాటిని ఖాతరు చేయకుండా ఉద్యోగుల పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించి, ఉత్పత్తి ఆధారిత జీతాలే మళ్లీ మంజూరుచేశారని వాపోతున్నారు. కొత్త సీఎండీ అయినా దీనిపై దృష్టిసారించి తగు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## సమస్యల పరిష్కారానికి నూతనోత్తేజంతో పోరాటాలకు సిద్ధం కావాలి



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నూతన ఉత్తేజంతో పోరాటాలకు సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం పోలవరం జిల్లా కార్యదర్శి పి రామరాజు కోరారు. గురువారం స్థానిక తాపీ మేస్త్రిల సంఘం సమావేశ మందిరంలో తాపీ మేస్త్రిల నెలవారి సమావేశం సంఘ అధ్యక్షులు సిగిరెడ్ల వీరబాబు అధ్యక్షతన జరిగింది. తొలుత కార్మికులు నూతన సంవత్సరం పురస్కరించుకొని కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన బిల్డింగ్ వర్కర్స్ జిల్లా నాయకులు రామరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు నిత్యం అనేక సమస్యలతో సతమాతమవుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే క్లైములు,సంక్షేమ పథకాలు అమలు చేయాలని సంక్షేమ బోర్డు పునరుద్ధించాలని రెక్కాడితే గాని డొక్కాడని భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభలు నేపథ్యంలో ఈనెల 4 లక్షలాదిమంది కార్మికులతో జరిగే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు తరలి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రి సంఘం నాయకులు ఎన్ అచ్చారావు, పి బుజ్జి, అప్పారావు,అప్పన్నబాబు,బి బుజ్జి,సత్తిబాబు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## రోజూ రెండు గంటలు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేద్దాం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రోజూ రెండు గంటలు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేద్దామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. ఉదయం ఎం వి పి కాలనీ లోని ఎ ఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం కాసు అధ్యక్షతన హరిత నూతన సంవత్సర వేడుకలు గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరమంతా భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం అన్నారు. మన ఇంటి మీద, చుట్టూతా ఆకుకూరలు కూరగాయలు పండించుదాం. అందరికీ అవగాహన కల్పించుదాం అన్నారు. విత్తనాలు ఇచ్చి పుచ్చుకునే పురాతన విధానం కొనసాగిద్దాం అని వివరించారు. డ్రోన్ల సహాయం తో కొండలూ, గుట్టలూ, సముద్ర, నదీ తీరం ప్రాంతాలలో దేశీయ విత్తనాలు చల్లుదాం అని పిలుపునిచ్చారు. పర్యావరణ సాంస్కృతిక కార్యక్రమాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం కాసు మాట్లాడుతూ విత్తనాల బంతులు తయారు చేసి అడవుల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చేద్దాం అన్నారు. పర్యావరణ హితంగా జీవించుదాం అన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ ఈ నెల 13 వ తేదీన బీచ్ రోడ్ లో లక్ష ఆవు పేడ పిడకలతో బోగీ మంట వేస్తాం అని దానిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేంగో మేన్ అప్పాజీ, యాక్షన్ ఎయిడ్ కరా?టక ప్రాజెక్ట్ సంస్థ అనకాపల్లి హెచ్ ఆర్ డి ఐ కృష? కుమారి, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు మాట్లాడారు. ముందుగా హరిత నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గ్రీన్ క్లైమేట్ టీం విద్యార్థులకు, లెక్చరర్లకూ ధాన్యం కంకులు కుచ్చులు, దేశీయ వంగ, టమాటా, పచ్చిమిర్చి, బంతి మొక్కల నారులు పంపిణీ చేశారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వాడవద్దు అని, పర్యావరణ హితంగా జీవించుదాం అని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు పలికారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మానసిక ఆరోగ్య అవగాహనపై వర్క్‌షాప్




**అరకులోయ, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం పి.ఎం. ఉషా కార్యక్రమంలో భాగంగా "వర్క్‌షాప్ ఆన్ మెంటల్ హెల్త్ అవేర్నెస్ ఫర్ ఆన్‌లైన్ లెర్నర్స్" అవగాహన సదస్సును కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు నేతృత్వంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ట్రైనర్ ఎన్.మాయావతి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం అంటే మన ఆలోచనలు,భావాలు, ప్రవర్తనలో సమతుల్యత కలిగి ఉండటమని,శారీరక ఆరోగ్యం లాగానే మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమైనదని, దీనిపై అవగాహన కల్పించడం ద్వారా సహాయం కోరడంపై ఉన్న కళంకాన్ని తగ్గించవచ్చని, ముందస్తు జోక్యాన్ని ప్రోత్సహించవచ్చని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె. శశికుమార్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం సరిగా లేకపోతే శారీరక పరిస్థితులు మరింత దిగజారుతాయని, అయితే మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం తినడం, నిద్ర, మొత్తం శారీరక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ కె.బాలరాజు మానసిక అనారోగ్యాల కారణాలు, సంకేతాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమ కోఆర్డినేటర్ సి.హెచ్. రక్షిత, సీనియర్ అధ్యాపకులు కె. ధర్మారావు, డా. కె. స్వరలత, డా. మురళీకృష్ణ ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో గిరిజనులకు కార్పొరేట్ వైద్యం



**పార్వతీపురం, సాలూరు, పతాకం న్యూస్:**గిరిజనులకు త్వరలో కార్పొరేట్ వైద్యసేవలు అందనున్నాయి. అత్యాధునిక వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లాలో నాలుగు నూతన ఆసుపత్రి భవనాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కొద్దిరోజుల్లో ప్రారంభించనున్నారు. దీంతో భద్రగిరి, సీతంపేట, కురుపాం, సాలూరు ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందనున్నాయి. దీని కోసం ప్రభుత్వం దాదాపు రూ.49 కోట్ల వ్యయం వెచ్చింది. సీతంపేట ఏరియా ఆసుపత్రిని 30 పడకల నుంచి వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ. 3 కోట్లతో 30 నుంచి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి అవసరమైన సదుపాయాలను సమకూర్చారు. రూ.8.95 కోట్లతో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 30 నుంచి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు.

## రహదారి నిబంధనలు పాటించాలి: కలెక్టర్ రామసుందర్‌రెడ్డి



**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, వాహనాలను అజాగ్రత్తగా నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. వాహనం నడిపేటప్పుడు నిర్లక్ష్యాన్ని వీడి తమ కుటుంబాలను, పిల్లలను ద ృష్టిలో ఉంచుకుని భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ఈ నెల 1 నుంచి 31 వరకూ నిర్వహిస్తారని, రవాణాశాఖాధికారులు పలు అవగాహన సదస్సులు నిర్వహించి డ్రైవర్లకు, వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యా సంస్థల్లో కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ ఉపకమిషనర్ మణికుమార్, రవాణాశాఖాధికారులు మురళీక ృష్ణ, దుర్గాప్రసాద్, శశికుమార్, రవిశంకర్ ప్రసాద్, వెంకటరావు, శివరామగోపాల్, రమేష్‌కుమార్, ఉషా, శ్రావ్య, ఐశ్వర్యలక్ష్మీ, నవీన్‌లు పాల్గొన్నారు.

## 1000 మంది గిరిజనులకు చలి రగ్గులు పంపిణీ




**అనంతగిరి, పతాకం న్యూస్:** అనంతగిరి మండలంలోని టోకూరు పంచాయతీ జాకరవలస, బొరిబొరి వలస, కుమ్మరివలస, ఎగువ శోభ పంచాయతీ ఎగువ శోభ, పొర్నపాదొర్ పూలుగుడ గ్రామాలకు 300 మందికి రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందరరేగా శ్రీ రామనుజ జీయర్ స్వామి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగా ఉందని తెలిసి చినజీయర్ స్వామి గిరిజనులకు 8000 వేల రగ్గులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మా గిరిజన ప్రజలకు సేవాద ృక్పథం తో రగ్గులు పంపిణీ చేస్తున్న స్వామిజీలకు గిరిజన ప్రజల తరపున క ృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు, టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, మాజి సర్పంచ్ సారా దొన్ను, గిరిజన సంఘం నాయకులు కిండంగి రామారావు, గెమ్మెల దేవన్న, పీసా కమిటీ సభ్యులు పాంగి గోపన్న, శిరగం అప్పలస్వామి, గెమ్మెల భీమరాజు, పాంగి అప్పలస్వామి, మాజీ సర్పంచ్ సొంటరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ షిర్డీ సాయి బాబా ధ్యాన మందిరంలో క్యాలెండరు ఆవిష్కరణ



**చోడవరం, పతాకం న్యూస్ :** చోడవరం వెంకయ్య గారి పేట లో వెలిసిన శ్రీ షిర్డీ సాయి బాబా ధ్యాన మందిరంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ క్యాలెండరు ముద్రణ కు పలువురు భక్తులు సహాయ సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో కె.వి రెడ్డి పనస రెడ్డి ఎంవి రమణ హరిబాబు వీర్రాజు మారుతి చంద్ర దేవరపల్లి చంటి దాముసపల్లి డాక్టర్, దేవరపల్లి బ్యాంకు పెద్ద శ్రీను, కన్నయ్య అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు.

## చిన్నగడ్డ గ్రామంలో పట్టాపాస్ పుస్తకాల పంపిణీ



**చింతపల్లి , పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా చింతపల్లి మండలం చిన్నగడ్డ గ్రామంలో శుక్రవారం పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం విజయవం తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం 30 మంది లబ్ధిదారులకు పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు.స్థానిక తహసీల్దార్ శంకర్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం లో ఎం పి పి కోరాబు అనూష దేవి, జడ్పీటీసీ సభ్యులు పోతురాజు బాలయ్య, చింతపల్లి మండల టీడీపీ అధ్యక్షులు పూర్ణచంద్రరావు తదితరులు మాట్లాడారు. చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో ఊర్మిళ, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రామస్థులకు భూమి హక్కులను బలోపేతం చేయడంలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

## శిథిలావస్థలో చినరావుపల్లి, భీమసింగి రైల్వే ఓవర్ బ్రిడ్జిలు



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరం నుంచి కొత్తవలసకు వెళ్లే రహదారిలో రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు ఉన్నాయి. ఈ రెండు ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తాయి. కొత్తవలస మండలం చినరావుపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి దాదాపు పదేళ్ల కిందట నిర్మించారు. అయితే అప్పుడే శిథిలావస్థకు చేరింది. ఎక్కడికక్కడే పెచ్చులు ఊడిపోయాయి. అడుగడుగునా బీటలు పడ్డాయి. బ్రిడ్జి మొదటి నుంచి చివరి వరకూ దెబ్బతిన్నది. అలాగే రోడ్డుపై గోతులు పడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ వంతెనను సు మారు రూ.16కోట్లతో నిర్మించారు. అప్పట్లో నిర్మించి న కాంట్రాక్టర్ రెండేళ్లు మాత్రమే పర్యవేక్షణ చేపట్టారు. తర్వాత దీనిని విడిచిపెట్టడంతో పూర్తిగా పాడయ్యింది. ఈ వంతెనకు విద్యుత్ సదుపాయం కూడా కల్పించలేదు. ఫ ఇదిలా ఉంటే భీమసింగి వద్ద 2018లో రూ.3,725 లక్షలతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి కూడా మరమ్మతులకు గురయ్యింది. ఎక్కడికక్కడే గోతులు పడ్డాయి. రోడ్డు దెబ్బతిన్నది. గత ఐదేళ్లు ఈ వంతెనను ఎవరూ పర్యవేక్షించకపోవడంతో మరింత అధ్వానంగా మారింది.

## సీఐకి వినోద్ బాబుకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సుధాకర్



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా చింతపల్లి మండలం చింతపల్లి సీఐ ఎన్ వినోద్ బాబుని మర్యాద పూర్వకంగా కలుసుకున్న వైసిపి ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జల్లి సుధాకర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025లో చింతపల్లి మండలానికి సిఐ గా వచ్చిన మీరు శాంతి భద్రతలను కాపాడి మంచి సేవలు అందించినం దుకు ప్రత్యేకమైన క ృతజ్ఞతలు చెప్తున్నామని అన్నారు. అనంతరం నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. 2026 సంవత్సరము మీ సేవలు చింతపల్లి ప్రజలకు అందించాలని ఆయన కోరారు. అనంతరం చింతపల్లి సీఐఎన్ వినోద్ బాబు మాట్లాడుతూ మీ అభిమానానికి నా క ృతజ్ఞతలు. చింతపల్లి మండల ప్రజల సహకారం మాకు ఉంటే అద్భుతమైన సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి భూసరి క ృష్ణ, మాజీ మండల వైసిపి అధ్యక్షులు సాగిన గంగన్న పడాల్, కవటం ఈశ్వరరావు పాల్గొన్నారు.

## రోలర్ స్కేటింగ్ క్రీడాకారిణి ని అభినందించిన ఎమ్మెల్యే పల్లా



**గాజువాక , పతాకం న్యూస్:** 66వ వార్డులో ఉంటున్న చిన్నారి కాకి బిందు మాధవి ఏయూలో ఎమ్మెస్సీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చదువుతున్నారు. ఆంధ్ర విశ్వవిద్యా లయంలో కెమిస్ట్రీ భాగంలో చదువుతున్న ఈ చిన్నారి డిసెంబర్ 5 నుండి 15 వరకు జరిగిన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఇన్ లైన్ ఆఫ్లైన్లో రజత పథకం సాధించింది. ఈ సందరరేగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రశంస పత్రం, తీసుకోవాలనే చిన్నారి కోరిక కొత్త సంవత్సరం తీరిందని ఆ బాలిక హర్షం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఈ చిన్నారిని దీవిస్తూ క్రీడల్లో నైపుణ్యం చెందిన కాకి బిందు మాధవ్ ని ఇంటర్నేషనల్ కి వెళ్లే విధంగా ఎదగాలని, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, మీకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీవెనలు కూడా మీకు ఉంటాయంటూ ఈ చిన్నారి మా తెలుగుదేశం కుటుంబంలో అమ్మాయి అవటం మాకు ఇంకా సంతోషంగా ఉందంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు కాకి అప్పల రెడ్డి, కాకి కమల, పెదనాన్న పెద్దమ్మ, కాకి వెంకటేశు, కాకి స్వరూప రాణి, 66వ వార్డు అధ్యక్షులు గోమాడ వాసు, వార్డు నాయకులు అందరూ పాల్గొని ఈ చిన్నారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు దీవెనలు తెలిపారు.

## మెండంగిలో తాగునీటి సమస్యపై ఆరా



**మక్కువ, పతాకం న్యూస్:** మండలంలోని పనసభద్ర పంచాయతీ మెండంగిలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యటించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.మధుకుమార్ రెడ్డి స్పందించారు. మెండంగి గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. తాగునీటి సమస్యపై ఆరా తీశారు. కొండపై నుంచి వచ్చే ఊటనీరు తాగడం వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను తెలిపారు. అనంతరం డీఈ పి.మధుకుమార్ రెడ్డి మాట్లాడుతూ మెండంగిలో తాగునీటి సమస్యను పరిశీలించామన్నారు. నీరు నిల్వ చేసే ట్యాంక్‌ను శు భ్రపరిచి క్లోరినేషన్ చేయించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. లీక్‌లు లేకుండా చూస్తామన్నారు. ట్యాంక్ నీటిలో ఎటువంటి బ్యాక్టీరియా చేరకుండా చర్యలు చేపడతామన్నారు. వేసవిలో ఊట ద్వారా వచ్చేనీరు చాలడం లేదని ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరారన్నారు. స్థానికంగా ఉన్న బోరును బాగుచేయిస్తామన్నారు.

## పుష్పగుచ్చాలకు బదులు పుస్తకాలు, పెన్నులు: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం నిర్ణయానికి ప్రశంసలు



**అరకులోయ, పతాకం న్యూస్:** నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి తనను కలవడానికి వచ్చే వారు పుష్పగుచ్ఛాలకు బదులుగా పుస్తకాలు, పెన్నులు బహూకరిం చాలని అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరిక మేరకు నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు స్పందించారు. జనవరి 1 గురువారం అరకు వ్యాలీ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కి నోట్‌బుక్స్, పెన్నులు, డిక్షనరీలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం అందజేసిన నోట్‌బుక్స్‌ను జనవరి 2 శుక్రవారం హుకుంపేట మండలంలోని కొంతిలి గ్రామ పంచాయతీ ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి, విద్యార్థుల బోధనపై అధ్యాపకులను ఆరాతీసి, మెరుగైన విద్యను అందించేలా క ృషి చేయాలని టీచర్లను ఆదేశించారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, “పుష్పగుచ్ఛాలు కొద్దిసేపటికే వాడిపోతాయి. కానీ పుస్తకాలు ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి” అని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడేలా అరకు ఎమ్మెల్యే తీసుకున్న ఈ నిర?యంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమం విద్యకు ప్రాధాన్యత ఇస్తూ సమాజానికి సూార్తినిస్తోంది.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కొయ్యూరు పీఆర్‌టీయూ బృందం

**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని జెడ్పిహెచ్ఎస్ బాలారం ప్రధానోపాధ్యా యులు మరియు ఎంఈవో(2) వి.జె.ఎస్.ప్రసాద్, ఏపిటీడబ్ల్యూఏ(బాలి కలు)పాఠశాల ప్రధానోపాధ్యా యులు డి.సత్యనారాయణని కలిసి కొయ్యూరు పీఆర్‌టీయూ బృందం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా అభినందించింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొయ్యూరు పీఆర్‌టీయూ నాయకులు వి.తలుపులు,కుంచె మురళి,బి.దేవత, ఎం.సత్యవతి, శాంతారావు,నాయుడు బాబు,వీరయ్య దొర,సంతోష్ కుమార్,అదేవిధంగా సీఆర్‌పీ సీతారాం హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం,విద్యాభివ ృద్ధి కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

## రూ..2.5 కోట్ల ప్యాకేజీతో చరిత్ర సృష్టించిన ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ- హైదరాబాద్) విద్యార్థి భారీ ప్యాకేజీతో సంచలనం స ృష్టించాడు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎడ్వర్డ్ నాథన్ వర్గీస్‌కు నెదర్లాండ్స్‌కు చెందిన గ్లోబల్ ట్రేడింగ్ సంస్థ ఆప్టివర్ ఏకంగా రూ. 2.5 కోట్ల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసింది. 2008లో ఐఐటీ హైదరాబాద్ ఏర్పాటైన నాటి నుంచి ఇదే అత్యధిక ప్యాకేజీ కావడం విశేషం. ఈ ఆఫర్ రెండు నెలల సమ్మర్ ఇంటర్న్‌షిప్ ద్వారా ప్రీ-ప్లేస్‌మెంట్ ఆఫర్ (పీపీఓ)గా వచ్చింది. ఈ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన ఇద్దరిలో వర్గీస్ ఒక్కరే పీపీఓ అందుకోవడం గమనార్హం. 21 ఏళ్ల వర్గీస్ జులై నుంచి ఆప్టివర్ నెదర్లాండ్స్ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పూర్తిస్థాయిలో విధుల్లో చేరనున్నాడు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన వర్గీస్, తన తల్లిదండ్రులిద్దరూ ఇంజినీర్లేనని తెలిపారు. ఈ విజయంపై వర్గీస్ మాట్లాడుతూ, "ఇదే నా మొదటి, ఏకైక ఇంటర్వ్యూ. పీపీఓ వస్తుందని నా మెంటార్ చెప్పినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. ఫస్ట్ ఇయర్ నుంచి కాంపిటేటివ్ ప్రోగ్రామింగ్‌లో దేశంలోని టాప్ 100లో ఉండటం ఇంటర్వ్యూలో నెగ్గడానికి బాగా ఉపయోగపడింది. ఐఐటీ ట్యాగ్ కూడా కలిసొచ్చింది" అని వివరించారు. ఈ ప్లేస్‌మెంట్ సీజన్‌లో మరో కంప్యూటర్ సైన్స్ విద్యార్థి రూ. 1.1 కోట్ల ప్యాకేజీని అందుకోవడం విశేషం. ఈ ఏడాది సంస్థ సగటు ప్యాకేజీ గత ఏడాదితో పోలిస్తే 75 శాతం పెరిగి రూ. 20.8 లక్షల నుంచి రూ. 36.2 లక్షలకు చేరింది. డిసెంబరులో ముగిసిన మొదటి దశ ప్లేస్‌మెంట్లలో 487 మంది యూజీ విద్యార్థులకు గాను 62 శాతం మంది ఉద్యోగాలు పొందారు. అధిక ప్యాకేజీల కంటే, ప్లేస్‌మెంట్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులందరికీ మంచి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని కెరీర్ సర్వీసెస్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి మయూర్ వైద్య తెలిపారు. టెక్ ఉద్యోగాలతో పాటు కోర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కూడా మంచి అవకాశాలు కల్పించడంపై ద ృష్టి సారించామని ఆయన చెప్పారు. త్వరలో ప్రారంభం కానున్న ఫేజ్-2 ప్లేస్‌మెంట్లలో మరిన్ని దేశీయ కంపెనీలు పాల్గొంటాయని ఐఐటీహెచ్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**మార్కాపురం, పతాకం న్యూస్:** రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు పండ్ల విక్రేతలు దుర్మణం పాలైన ఘటన మండలంలోని శిరిగిరిపాడు శివారులో గురువారం జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్లకు చెందిన కరిముల్లా (50), నూర్జహాన్ (45) మాచర్లలోని అంబేద్కర్ సెంటర్‌లో తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తుంటారు. వీరు తమకు కావాల్సిన పండ్లను మార్కాపురంలో తెచ్చుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో  వీరిద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై మార్కాపురానికి వెళ్తున్నారు. శిరిగిరిపాడు శివారులోకి వెళ్లగానే అదే గ్రామానికి చెందిన యువకుడు మరో ద్విచక్రవానంపై ఎదురుగుగా వచ్చి ఢీకొట్టాడుజ దీంతో కరిముల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన నూర్జహాన్‌ను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కొద్దిసేపటికి మ ృతి చెందారు. ఢీకొట్టిన యువకునికి స్వల్ప గాయాలు కావడంతో గ్రామంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మ ృతురాలు నూర్జహాన్ మాచర్లకు చెందిన మహిళ కాగా ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరు హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. మరో మ ృతుడు కరిముల్లా సొంతూరు మార్కాపురం కాగా కొన్నేళ్ల కిందట మాచర్లకు వచ్చి ఉంటున్నట్లు తెలిసింది. వెల్దుర్తి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

## గంజాయి ముఠాపై పోలీసులు ఉక్కుపాదం



**అనంతపురం, పతాకం న్యూస్:** కదిరి పట్టణ పోలీసులు గంజాయి ముఠా పై ఉక్కుపాదం మోపారు. గంజాయి విక్రయించే నలుగురు వ్యక్తులను వినూత్న రీతిలో పట్టణంలో రోడ్డు పై నడిపించుకుంటూ స్టేషన్ వరకు తీసుకెళ్లారు. శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో  కదిరి డీఎస్పీ శివనారాయణ మాట్లాడుతూ..  కదిరి పట్టణంలోనీ కోనేరు సమీపాన ఏటివద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని గంజాయి విక్రయించే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశాము' అని అన్నారు.  అరెస్టైన వారిలో భూక్యా ఆంజనేయులు నాయక్, దేవరకొండ పవన్ కుమార్, సాకే సూరి, చాకలి ఆదినారాయణలను అరెస్ట్ చేశామని వీరి వద్ద నుండి 1.2 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని మరో 9 మంది అనుమానితులను గుర్తించినట్లు తెలిపారు.

# అమరావతి భూ సమీకరణకు పదకొండేళ్లు



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతి నిర్మాణ ప్రక్రియ ప్రారంభమై నేటికి 11 సంవత్సరాలు. 2015 జనవరి 2వ తేదీన నేలపాడులో పూలింగు కింద భూములు తీసుకునే ప్రక్రియను ప్రారంభించారు. తొలిరోజు కొమ్మినేని ఆదిలక్ష్మి అనే మహిళ 3.50 ఎకరాలు ఇచ్చారు. రెండో వ్యక్తిగా దామినేని శ్రీనివాసరావు 15 ఎకరాలు, ధనేకుల రామారావు 11 ఎకరాలు పూలింగు కింద ఇచ్చారు. తొలిరోజు 89 ఎకరాలు భూసమీకరణ కింద తీసుకున్నారు. అప్పట్లో మూడేళ్లలో రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను పూర్తిగా అభివ ృద్ధి చేసి తిరిగి ఇచ్చేస్తామని ప్రకటించారు. ఐదేళ్లలో రాజధాని పూర్తవుతుందని, పరిపాలన అక్కడ నుండే ప్రారంభిస్తామనీ ప్రభుత్వం ప్రకటించింది. నేటికి సరిగ్గా 11 సంవత్సరాలు పూర్తయినా ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయి. ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో సమీకరణ కింద ఇంకా భూములు తీసుకుంటున్నారు. 2,200 ఎకరాలు ఇంకా తీసుకోవాల్సి ఉంది. అమరావతి సమీకరణ అనంతరం రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఇప్పటికీ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. రైతుల సమస్యలు పరిష్కారానికి నోచలేదు. వాటిని పరిశీలించేందుకు త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసినా అక్కడ ఇంకా చర్చల దశలోనే సమస్యలు ఉన్నాయి. రైతులు మాత్రం జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసుకుని వేర్వేరు పద్ధతుల్లో తమ నిరసనలు వ్యక్తం చేశారు. 2015 జనవరిలో ప్రక్రియ ప్రారంభమైతే ప్రభుత్వ పరిపాలనకు సంబంధించి ఇప్పటికీ అక్కడ ప్రారంభమైంది తాత్కాలిక సెక్రటేరియట్, తాత్కాలిక హైకోర్టు మాత్రమే. శాశ్వత నిర్మాణంగా సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయం మాత్రం పూర్తయింది. ఒకటీ రెండు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు తమ భవనాలు ప్రారంభించుకున్నాయి. సిటీ సివిల్ కోర్టు భవనాల్లోనే ఇప్పటికీ కొన్ని హైకోర్టు విభాగాలు నడుస్తున్నాయి. మాస్టర్‌ప్లానులో వీధిపోటు ప్లాట్లు ఇంకా ఉన్నాయి. అలాగే గ్రామకంఠం భూముల సమస్య, జరీబు, నాన్‌జరీబు, అసైండ్ భూములు, చెరువు భూమిలో ప్లాట్ల కేటాయింపు వంటి సమస్యలు 11 ఏళ్ల నుండి కొనసాగుతూనే ఉన్నాయి. వెంకటపాలెం గ్రామంలో అయితే జాతీయ రహదారి భూమిలో ప్లాట్లు వచ్చిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కరకట్టను విస్తరించి మూడేళ్లలో జాతీయ రహదారికి అనుసంధానం చేస్తామని అప్పట్లో మంత్రి నారాయణ ప్రకటన చేసినా ఇప్పటికీ అనుసంధాన పనులు జరుగుతున్నాయి. రాజధాని చట్టబద్ధత అంశం కొలిక్కి రాలేదు. ఇంకా న్యాయ పరిశీలనలోనే ఉంది. గెజిట్ వస్తుందని అనుకున్నా రాలేదు. రాజధాని రైతులు ప్రభుత్వానికి భూములిచ్చారు. 2019 వరకూ టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనూ వారి సమస్యలు పరిష్కారం కాలేదు. 2019 తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానుల ప్రకటనతో రైతులు ఒక్కసారిగా కుదేలయ్యారు. వారిపై కేసులు, పనులు నిలిపేయడం వంటి చర్యలతో రాజధాని పనులు దాదాపు నిలిచిపోయాయి. 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పనులు ప్రారంభించినా ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో రెండు ప్రభుత్వాలు మారినా కేంద్రంలో బిజెపియే అధికారంలో ఉంది. రాజధానికి ఇస్తామన్న నిధులూ ఇవ్వలేదు. చేస్తామన్న పనులూ చేయలేదు. రెండు పార్టీలనూ తన పంచన చేర్చుకుని పబ్బం గడుపుకుంది. చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టితో చేతులెత్తేసింది. రూ.5 వేల కోట్లు ఇస్తామని చెప్పినా చివరకు తాము ఇవ్వాల్సింది రూ.2,200 కోట్లేనని చేతులు దులుపుకుంది. అయినా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో కేంద్రాన్ని నిలదీయలేదు. 2018 చివర్లో కేంద్రం మోసాన్ని కడిగిపారేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి నేడు అదే బిజెపి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నారు. జిఎడి టవర్లకు 2019లో ర్యాఫ్ట్ వేస్తే ఇప్పుడు కొద్దికొద్దిగా పనులు ప్రారంభిస్తున్నారు. ల్యాండ్ పూలింగు స్కీము ప్లాట్ల అభివ ృద్ధి పనులు, రోడ్ల ఏర్పాట్లు వంటివి చేస్తున్నారు.

# అత్యాధునిక హంగులతో వందే భారత్ స్లీపర్..

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పరుగులకు సిద్ధమైంది. ఈ రైలుకు సంబంధించిన తొలి రూట్‌ను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అధికారికంగా ప్రకటించారు. అస్సాంలోని గువాహటి నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలు నడవనుందని ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఈ రైలు టెస్టింగ్, సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ ఈ సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఇటీవల కోటా-నాగ్దా సెక్షన్‌లో నిర్వహించిన ఫైనల్ ట్రయల్ రన్‌లో ఈ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో విజయవంతంగా దూసుకెళ్లింది. ఈ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉండగా.. ఇందులో 11 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, ఒక ఫస్ట్ ఏసీ కోచ్ ఉన్నాయి. ఒకేసారి మొత్తం 823 మంది ప్రయాణించేలా దీనిని రూపొందించారు. వ్యాపారవేత్తలు, కుటుంబాలు, విద్యార్థులతో పాటు పర్యాటకులకు ఈ రాత్రిపూట ప్రయాణం (ఓవర్‌నైట్ జర్నీ) ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

టికెట్ ధరల విషయానికొస్తే.. ఆహారంతో కలిపి థర్డ్ ఏసీకి సుమారు రూ. 2,300, సెకండ్ ఏసీకి రూ. 3,000, ఫస్ట్ ఏసీకి రూ. 3,600గా ఉండనున్నట్లు సమాచారం. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ ఈ రైలును తీర్చిదిద్దారు. ఎర్గోనామిక్ బెర్తులు, ఆటోమేటిక్ డోర్లు, అత్యాధునిక లైటింగ్, శబ్దం రాకుండా ప్రత్యేక చర్యలు, కవచ్ యాంటీ కొలిజన్ సిస్టమ్ వంటి ఆధునిక హంగులు ఇందులో ఉన్నాయి. వరల్డ్ క్లాస్



సౌకర్యాలతో కూడిన ఈ వందే భారత్ స్లీపర్.. రాత్రి ప్రయాణాల్లో ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుందని రైల్వే శాఖ తెలిపింది.

# విషాదం.. ముగ్గురు పిల్లలకు విషం ఇచ్చి..
# తండ్రి కూడా ఆత్మహత్య

**కర్నూలు, పతాకం న్యూస్:** ఉయ్యాలవాడ మండలం తుడుమలదిన్నె గ్రామానికి చెందిన వేములపాటి సురేంద్ర(35)కు అవుకు మండలం మహేశ్వరితో 8 ఏళ్ల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. సురేంద్ర వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవించేవాడు. వీరికి కావ్యశ్రీ(7), ధ్యానేశ్వరి(4), సూర్యగగన్(1) చిన్నారులు సంతానం. అయితే మహేశ్వరి బాలింతగా ఉండగా గతేడాది ఆగస్టు16వ తేదీన అనారోగ్యంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి ఆ కుటుంబాన్ని కష్టాలు వెంటాడాయి. చిన్నపిల్లల ఆలనాపాలనా చూసేందుకు ఎవరూ సాయం చేసేవారు కారు. కనీసం బంధువులు కూడా వచ్చేవారు కారు. తల్లిలేని చిన్నారులను ఎలా పెంచాలో తెలియక, వారికి స్నానం చేయించలేక, తిండి పెట్టలేక సురేంద్ర రోజూ అవస్థలు పడేవాడు. కావ్యశ్రీ, ధ్యానేశ్వరిలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపేవాడు. ఇక సూర్య గగన్‌ను ఎలా చూసుకోవాలో అతడికి తెలిసేది కాదు. అయినప్పటికీ ఐదు నెలలుగా ఎలాగోలా చూసుకునేవాడు. పిల్లలను చూసుకోవటం భారంగా భావించాడో లేక వారిని పోషించటానికి ఆర్థిక కారణాలు అడ్డువచ్చాయో తెలియదు కానీ తాను తనువు చాలిస్తే తన పిల్లలు మరొకరికి భారం కాకూడదనుకున్నాడో ఏమో ముగ్గురు పిల్లలకు రాత్రి పడుకునే సమయంలో కూల్‌డ్రింక్‌తో పాటు పాలల్లో విషం కలిపి తాపించాడు. అనంతరం తాను కూడా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదిలా ఉం డగా ఆత్మహత్య ఘటనకు ముందు స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను సెల్‌ఫోన్



ద్వారా తెలియజేశాడు. ఉదయం 8 గంటలైనా పిల్లలు ఇంటి నుంచి బయటకు రాకపోవటంతో పక్క వీధిలో ఉంటున్న చిన్నారుల నానమ్మ(సురేంద్ర తండ్రి చిన్నభార్య)కు అనుమానం వచ్చి చూడగా... అప్పటికే సురేంద్ర ఇంట్లో కొక్కానికి వేలాడుతూ కనిపించాడు. పక్కన పిల్లలు కూడా విగతజావులుగా పడిఉండటాన్ని గమనించింది.

# అన్నీ మర్చిపోతున్నారా? ప్రతీది గుర్తుపెట్టుకోవాలంటే...



స్కూల్లో విన్న పాఠాలు ఇంటికొచ్చేలోపు మర్చిపోతారు. ఓ చోట పెట్టిన ఫోన్, ఇల్లాంతా వెతికినా ఎక్కడ పెట్టారో ఓ పట్టాన గుర్తుకు రాదు. ఏమైనా తీసుకురావాలా అంటూ ఇంట్లో అడుగుతారు. తీరా మార్కెట్?కు వెళ్లాక చెప్పింది మర్చిపోయి మళ్లీ ఫోన్ చేసి అడుగుతారు'. ఇలాంటి అనుభవాలు చాలామందికి తరచూ ఎదురయ్యేవే. ఉన్నట్టుండి మెదడు మొద్దుబారటం, మనుషుల పేర్లు, ఉన్నట్టుండి వస్తువులు మరచిపోవటం చూస్తూనే ఉంటాం. ఈ పరిస్థితికి వయసుతో సంబంధం లేదు. చిన్న,పెద్ద అనే తేడా లేకుండా అందరిలోను కనిపిస్తూనే ఉంటుంది. దీంతో చాలామంది అప్పుడే మతిమరుపు వచ్చేసిందా? డిమెన్షియా, అల్జీమర్స్ దాడి చేస్తున్నాయా? అని కలవర పడుతుంటారు. ఇలాంటి పరిస్థితిలో మెదడు ఆరోగ్యంపై ద ృష్టి పెట్టాలంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం! అప్పుడప్పుడూ మరచిపోవటానికి ఒత్తిడి, విశ్రాంతి కొరవడటం, నిద్రలేమి, మద్యం తాగటం వంటివి దారితీస్తుంటాయంటున్నారు నిపుణులు. అకస్మాత్తుగా, ఏదైనా కడుపు నిండా తిన్న తర్వాత రక్తసరఫరా మెదడు నుంచి జీర్ణాశయానికి మళ్లటంతోనూ ఇలా జరగొచ్చు. ముఖ్యంగా, దగ్గు మందులు, అలర్జీ తగ్గించేవి, కండరాలను వదులు చేసేవి, కొన్ని రకాల నొప్పి మాత్రల వంటివీ మరపు తెచ్చిపెట్టొచ్చట. ఇంకా హార్మోన్ల మార్పులు. శరీరంలోని దాదాపు అన్ని అవయవాలు, ముఖ్యంగా మెదడు సమర్థంగా పనిచేయటానికి థైరాయిడ్ హార్మోన్లు ముఖ్యం. వీటి లోపం అల్జీమర్స్ తెచ్చిపెట్టొచ్చు. థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోతే బరువు పెరగటం, మలబద్ధకం, నిస్సత్తువ, చర్మం పొడిబారటం వంటి లక్షణాలూ కనిపిస్తాయి. మహిళల్లో నెలసరి నిలిచినప్పుడు, గర్భం ధరించినప్పుడు ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల మధ్య సమతుల్యత లోపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో కొద్ది నెలల పాటు మతిమరుపుతో ఇబ్బంది పడుతుంటారు. ఇది తాత్కాలికంగా ఉంటుంది. కొద్ది రోజులకు అదే కుదురుకుంటుంది. ఆయా సందర్భాలు సంఘనలను నిశితంగా పరిశీలిస్తే తాత్కాలిక మతిమరుపు ఎందుకొచ్చిందనేది చాలామంది తమకు తామే గుర్తించగలరు. తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవటం, జబ్బులు రావటం, తలకు దెబ్బలు తగలటం, ఎక్కువగా మద్యం సేవించడం వంటివి దీనికి దారితీస్తున్నట్టు అధ్యాయనంలో తేలింది. ఇలా మతిమరుపు లక్షణాలు విడవకుండా వేధిస్తున్నా వెంటనే కంగారు పడాల్సిన పనిలేదంటున్నారు నిపుణులు. అల్జీమర్స్, డిమెన్షియా, మానసిక సమస్యేమో అని చింతించటానికి బదులు ముందుగా కొన్ని పరీక్షలు చేయించుకోవటం మంచిదట. రక్తంలో విటమిన్ బి, థైరాయిడ్, ఐరన్ వంటి పరీక్షలు చేయించుకోవాలి. లక్షణాలు తీవ్రమవుతున్నా లేదా ఎక్కువవుతున్నా మెదడు సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలు అవసరమవుతాయి. తీవ్ర మతిమరపును తెచ్చి ఎట్టే డిమెన్షియా తీరే వేరు. ఇది కొన్ని ముందస్తు హెచ్చరిక సంకేతాలు ఇస్తుంటుంది. మామూలుగా ఇందులో మతిమరపు తీవ్రంగా ఉంటుంది. ముఖ్యంగా, ఇటీవలి సంఘటనలను మర్చిపోతామని అధ్యయనం పేర్కొంది. దీర్ఘకాలిక ప్రణాళికలు వేసుకోలేకపోవటం, అంచెలంచెలుగా ఆలోచించి తేలికగా పరిష్కరించగల సమస్యల విషయంలోనూ ఇబ్బంది పడటం కనిపిస్తుంటాయంటున్నారు నిపుణులు. రోజూ చేసే, తెలిసిన పనులు కూడా చేయటానికీ ఇబ్బంది పడతామట. టైం, తేదిలు గుర్తించటంలోనూ తికమక పడుతుంటారు. కొంతమంది ఇంట్లో వారితో కూడా కలవటానికీ వెనకాడటం చూస్తుంటాం. దిగులు, నిరాశ, ఆందోళన, చిరాకు, కోపం వంటివీ తలెత్తొచ్చు. ఇలాంటి లక్షణాలను చాలా వరకూ కుటుంబ సభ్యులే గుర్తుపడుతుంటారు. ఇలాంటివి గమనిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించటం మేలు. మతిమరపు రావటానికి సరిదిద్దుకోదగిన కారణం ఉన్నట్టు తేలితే తగు చికిత్స తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. వయసు మీద పడుతున్నకొద్దీ కొంత జ్ఞాపక శక్తి తగ్గటం, ఎంతో కొంత మతిమరపు రావడం సర్వసాధారణం. కాబట్టి, మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరంటున్నారు నిపుణులు. డయాబెటిస్, హైబీపీ, అధిక కొలెస్ట్రాల్ వంటివి అదుపులో ఉంచుకోవాలి.

రోజూ తాజా పండ్లు, కూరగాయలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తినాలి. విటమిన్ డి, క్యాల్షియం లోపం ఉంటే భర్తీ చేసుకోవాలి. వయసు పెరుగుతున్న కొద్దీ బి విటమిన్లను సంగ్రహించుకునే శక్తి తక్కువగా ఉంటుంది. ఎందుకంటే, మెట్‌ఫార్మిన్ వంటి మందులతోనూ ఇలా జరగొచ్చు. కాబట్టి, విటమిన్ బి ఎక్కువగా ఉండే ఆహారం, సప్లిమెంట్స్ తీసుకోవాలి. రోజుకు కనీసం అరగంట పాటు వ్యాయామం, శారీరక శ్రమ చేయాలి. దీంతో మెదడుకు తగినంత రక్తం సరఫరా అందడంతో పాటు కండరాల నుంచి మేలు చేసే రసాయనాలు విడుదల అవుతాయి. దీంతో మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఈ క్రమంలో రోజుకు 7 వేల అడుగుల నడిస్తే మరణ ముప్పు 47 శాతం తగ్గుతుందని లాన్సెట్ నివేదిక వెల్లడించింది. నడక వల్ల మతిమరుపు 38 శాతం, కుంగుబాటు 22 శాతం మేర తగ్గుతుందని తెలిపింది. పుస్తకాలు చదవటం, పజిల్స్ పూరించటం, నలుగురితో కలవటం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటం వంటి పనులతో మెదడు చురుకుగా ఉంటుంది. రాత్రిపూట 7 నుంచి 8 గంటల సేపు నిద్రించాలి. దీనివల్ల మెదడుకు తగినంత విశ్రాంతి లభించి, పునరుత్తేజితమవుతుంది.

మానసిక ఒత్తిడి, ఆందోళన మేధాశక్తిని గణనీయంగా దెబ్బతీస్తుంది. కాబట్టి, దీన్ని అదుపులో ఉంచుకోవాలి. మనం మార్చటానికి వీల్లేని పరిస్థితుల గురించి అదే పనిగా బాధపడటం, ఆలోచించటం మానెయ్యాలి. శ్వాస మీద ధ్యాస పెట్టి చేసే ధ్యానం, ప్రాణాయామం లాంటివి మనసు తేలిక పడటానికి సహాయపడతాయి.

# 'వాటర్ హీటర్' వాడుతున్నారా? ఎలాంటిది తీసుకోవాలి?



శీతాకాలం వచ్చిందంటే చాలు, చన్నీటితో ముఖం కడుక్కోవడం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. అలాంటి చలిలో వేడివేడి నీళ్లతో స్నానం చేస్తే ఆ హాయే వేరు కదండీ! అయితే, నీళ్లు కాచుకోవడానికి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటారు. కొందరు గీజర్ ఉపయోగిస్తే, మరికొందరు గ్యాస్ స్టౌ వాడుతుంటారు. ఇంకొందరేమో వాటర్ హీటర్?తో నీళ్లు వేడి చేసుకుంటుంటారు. అయితే, వీటిలో చాలామంది ఇళ్లలో ఉండేది మాత్రం వాటర్ హీటరే! అందుబాటు ధరకు లభించడం, తక్కువ సమయంలో నీళ్లు వేడి అవ్వడం వల్ల చాలామంది దీన్ని ఎక్కువగా వినియోగిస్తారు. కానీ, దీన్ని ఉపయోగించే క్రమంలో కొంతమంది చేసే పొరపాట్లు వారి ప్రాణాలకే ముప్పు తెచ్చిపెడుతున్నాయి. ఈ క్రమంలో దీన్ని వాడేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం! ఐఎస్ఐ మార్క్ ఉన్నవి, బ్రాండెడ్ కంపెనీలవే కొనుగోలు చేయాలి. హీటర్ కాయిల్స్ పైన ఉండే సిలికా కోటింగ్, రెండేళ్ల తర్వాత తొలగిపోతూ ఉంటుంది. అప్పుడు కొత్తది తెచ్చుకోవాలి.

కొంతమంది ప్లాస్టిక్ బకెట్లలో హీటర్ పెడుతుంటారు. అయితే, ఈ క్రమంలో నేరుగా బకెట్?ను హీటర్ హుక్‌ను తగిలించకూడదు. ఆ వేడికి ప్లాస్టిక్ కరిగిపోతుంది. ఇది ప్రమాదకరమంటున్నారు నిపుణులు. కాబట్టి, ప్లాస్టిక్ బకెట్‌లో హీటర్ పెట్టాలనుకుంటే దానిపై ఒక సన్నటి చెక్కను ఉపయోగించడం మేలు. అల్యూమినియం బకెట్ ఉంటే దానికి నేరుగా హీటర్‌ను అమర్చవచ్చు. విద్యుత్తు షాక్ తగిలే ప్రమాదం ఉన్నందున ఇనుప బకెట్?ను వాడకపోవడం మంచిదంటున్నారు నిపుణులు. అలాగే, వాటర్ లెవెల్?ని బట్టి బకెట్?ను పూర్తిగా నింపిన తర్వాత హీటర్?ను ఆ నీళ్లలో ఉంచాలి. అది కూడా హీటింగ్ కాయిల్ పూర్తిగా మునిగేలా జాగ్రత్తపడాలి. ఆ తర్వాతే ప్లగ్?ని సాకెట్?కి కనెక్ట్ చేసి స్విచ్చాన్ చేయాలి. అయితే, బకెట్?లో నీరు 90 శాతంపైగా ఉండాలి. హీటర్?ను నీటిలో ఎంతవరకు ముంచాలి అనే మార్క్ ఉంటుంది. ఆ మార్క్ వరకు నీరు ఉండేలా చూసుకోవాలి. స్విచ్ వేశాక నీళ్లు వేడయ్యాయో, లేదో చెక్ చేసే విషయంలో కొందరు ఏమరుపాటుగా వ్యవహరిస్తుంటారు. మర్చిపోయి అలాగే నీళ్లలో చేయి పెట్టారంటే షాక్ తగిలి ప్రాణాల మీద కొస్తుంది. స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తొలగించిన తర్వాతే నీళ్లను ముట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నీళ్లు మరగాలని మరీ ఎక్కువ సేపు హీటర్?ను అలాగే స్విచ్ ఆన్ చేసి ఉంచడం కూడా మంచిది కాదని వివరిస్తున్నారు. కొంతమంది వాటర్ హీటర్స్ నేరుగా బాత్?రూమ్స్?లో వాడుతుంటారు. ఈ క్రమంలో 2 ఇన్ 1 కనెక్షన్ ఇస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం అంటున్నారు నిపుణులు. ఎందుకంటే, ఒకవేళ స్విచ్ ఆఫ్ చేయడం మర్చిపోయి అలాగే బాత్?రూమ్?లోకి వెళ్లామంటే అక్కడున్న తేమకు కరెంట్ షాక్ కొట్టే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

ఒక్కోసారి మర్చిపోయి నీళ్లలో పెట్టకుండానే హీటర్ స్విచ్ ఆన్ చేసేస్తాం. దీనివల్ల హీటర్ కాయిల్ నిప్పు కణికలా మారి మండిపోయే ప్రమాదం ఉంది. ఏమరుపాటుగా దాన్ని తాకితే షాక్ తగిలి ప్రాణాల మీదకొస్తుంది.

పిల్లలున్న ఇళ్లలో వాటర్ హీటర్ వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండి వారు పదేపదే తిరిగే ప్రదేశాల్లో కాకుండా ఏదో ఒక మూలకు లేదంటే ప్రత్యేకమైన గదిలో ఉంచాలి.

# 100 మిలియన్ డాలర్ల టెస్లా షేర్లను విరాళంగా ఇచ్చిన ఎలాన్ మస్క్



**న్యూయార్క్:** టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఏడాది ముగింపు పన్ను ప్రణాళికలో భాగంగా సుమారు 2,10,000 టెస్లా షేర్లను విరాళంగా ఇచ్చారు. వీటి విలువ దాదాపు 100 మిలియన్ డాలర్లు (రూ. 900 కోట్లు) ఉంటుందని ఎస్ఈసీ ఫైలింగ్‌లో వెల్లడైంది. అయితే ఈ విరాళం ఏ సంస్థలకు ఇచ్చారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. 619 బిలియన్ డాలర్ల ఆస్తి ఉన్న మస్క్, ఈ విరాళాన్ని తన భవిష్యత్తు వ్యూహంలో భాగంగానే ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. టెస్లాలో తనకున్న వాటా సరిపోదని మస్క్ కొంతకాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్ విభాగాల్లో టెస్లాను ముందుకు తీసుకెళ్లాలంటే తనకు కనీసం 25 శాతం ఓటింగ్ నియంత్రణ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సరైన నియంత్రణ లేని పక్షంలో తనను సీఈవో పదవి నుంచి తొలగించే ప్రమాదం ఉందని, ఆ స్థితిలో రోబోటిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడం ఇష్టం లేదని అక్టోబర్‌లో ఆయన పేర్కొన్నారు. నవంబర్‌లో టెస్లా వాటాదారులు మస్క్ కోసం ఒక కొత్త వేతన ఒప్పందాన్ని ఆమోదించారు. దీని విలువ సుమారు ట్రిలియన్ డాలర్ల వరకు ఉండే అవకాశం ఉంది. వచ్చే దశాబ్ద కాలంలో కంపెనీ నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటే, మస్క్ వాటా ప్రస్తుత 13 శాతం నుంచి దాదాపు 29 శాతానికి పెరుగుతుంది. ఇది ఆయన కోరుకుంటున్న 25 శాతం కంటే ఎక్కువే కావడం గమనార్హం.

మరోవైపు ఈ వారం టెస్లా వార్షిక విక్రయాల గణాంకాలు వెలువడనున్నాయి. చైనా, ఐరోపా వంటి కీలక మార్కెట్లలో విక్రయాలు తగ్గుముఖం పట్టడంతో, వరుసగా రెండో ఏడాది కూడా అమ్మకాలలో క్షీణత నమోదయ్యే అవకాశం ఉందని కంపెనీ స్వయంగా అంచనా వేసింది. అయినప్పటికీ, రోబోటాక్సీలు, అటానమస్ డ్రైవింగ్ రంగంలో మస్క్ విజన్ పై ఉన్న నమ్మకంతో టెస్లా షేర్ ధరలు రికార్డు స్థాయిలోనే కొనసాగుతున్నాయి.

# విశాఖ ఎకనమిక్ రీజియన్ పేరిట.. భారీగా భూ పందేరం

## ఐటీ పేరిట మూడు మండలాల్లో 1,100 ఎకరాలు.. కొత్తవలసలో జీఎంఆర్‌కు 600 ఎకరాలు




**విజయనగరం,, పతాకం న్యూస్:** విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ పేరిట విజయనగరం జిల్లాలో కార్పొరేట్ సంస్థలకు మరోసారి భారీగా భూములు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఐటి అభివృద్ధి పేరిట నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలోని భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో 1,100 ఎకరాలు, మల్టీ ప్రొడక్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటు పేరిట కొత్తవలస మండలంలో 547.50 ఎకరాలు, బొమ్మల తయారీ ఫ్యాక్టరీ పేరిట పూసపాటిరేగ మండలంలో 195.13 ఎకరాలు కేటాయించింది. వీటితోపాటు పతంజలి సంస్థలకు 2,017లో కేటాయించిన 172.84 ఎకరాల్లో ఫుడ్ పార్కు, ఎస్.కోట మండలంలో 20 ఏళ్ల క్రితం కేటాయించిన 1,166 ఎకరాల భూముల్లో ప్రైవేటు ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు కానున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. విజయనగరం జిల్లా పరిధిలో ఐదు చోట్ల పరిశ్రమలు రానున్నట్లు ప్రచారం చేస్తోంది. ఇందులో రెండు ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం భూమి కేటాయించింది. మరో మూడు ప్రాజెక్టుల పేరిట కొత్తవలస, పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాల్లో భారీగా భూములు గుర్తించి, ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే పనిలో ఉంది. మల్టీ ప్రొడక్ట్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ పార్కు పేరిట కొత్తవలస మండలం బలిఘట్టం, నిమ్మలపాడు, తుమ్మికాపల్లి, కంటకాపల్లి, అర్ధన్నపాలెం గ్రామాల పరిధిలో 547 ఎకరాలు, అప్రోచ్ రోడ్డు కోసం మరో 0.50 ఎకరాలు చొప్పున కేటాయించింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో మల్టీ ప్రొడెక్ట్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుకు జిఎంఆర్ గ్రూప్ సంస్థకు చెందిన ఇన్‌ఫ్రాకు కట్టబెట్టేందుకు నిర?యించినట్టు సమాచారం. ఇదే మండలం పెదరావుపల్లి రెవెన్యూ పరిధిలో పతంజలి ఫుడ్ పార్కు కోసం 2017లో అప్పటి ప్రభుత్వం 172.84 ఎకరాలు కేటాయించింది.

ఇందులో రూ.200 కోట్లు పెట్టుబడితో బహుళ ఉత్పత్తి ఆహార ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు కానున్నట్లు ప్రభుత్వం చెప్తోంది. బొమ్మల తయారీ పార్కు కోసం పూసపాటిరేగ మండలం జి.చోడవరం, కనిమెట్ట రెవెన్యూ పరిధిలోని 195.13 ఎకరాలు కేటాయించింది. ఎస్.కోట మండలంలో జిందాల్ అల్యూమినా శుద్ధి కర్మాగారం కోసం 1,166.43 ఎకరాలను సుమారు 20 ఏళ్ల క్రితం కేటాయించినా ఫ్యాక్టరీ ఏర్పాటు కాలేదు. అయినా, ఆ సంస్థకు భూమి మొత్తాన్ని కట్టబెడుతూ ఇటీవల మంత్రివర్గం నిర?యించింది. జిందాల్‌కు అప్పగించిన భూమిలో ఆ సంస్థ ఆధ్వర్యాన ప్రైవేట్ బహుళ ఉత్పత్తుల తయారీ కేంద్రం ఏర్పాటు కానుందని విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ ప్రాజెక్టు రిపోర్టులో ప్రభుత్వం పేర్కొంది. ఐటి అభివృద్ధి పేరిట నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లోని 21 గ్రామాల పరిధిలో 1100.84 ఎకరాల భూమిని గుర్తించింది. భోగాపురం, డెంకాడ మండలాల పరిధిలో రెండేసి క్లస్టర్లు, పూసపాటిరేగలో ఒక క్లస్టర్ చొప్పున మొత్తం ఐదు క్లస్టర్లుగా విభజించారు. ఇందులో ప్రభుత్వ భూమితోపాటు విలువైన పంట భూములు, మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూములు ఉన్నాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా టూరిజం అభివృద్ధి పేరిట భోగాపురంలో ఎరోసిటీకి 500 ఎకరాలను కేటాయించింది.




# క్రికెట్‌లో ఆ మూడు సమస్యలు అధిగమిస్తే..



2026లో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) ప్రధానంగా ఆ మూడు ప్రశ్నలపై దృష్టి సారిస్తే మంచిది. 2025 ఏడాదిలో ప్రధానంగా ఆ మూడు ప్రశ్నలే అభిమానులను తీవ్ర మానసిక క్షోభకు గురిచేశాయి. అందులో ఒకటి టి20ల్లో సూర్యకుమార్ యాదవ్ ప్రదర్శన కాగా.. రెండోది టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకొనే ఏకపక్ష నిర?యాలు. ఇక మూడోది స్వదేశంలో టీమిండియా ఆడే టెస్టుల్లో సిరీస్ కోల్పోవడం. 2026లో కనీసం ఆ మూడు సమస్యలను టీమిండియా అధిగమిస్తే.. ఈ ఏడాది జరిగే మూడు ప్రపంచకప్ టైటిళ్లు భారత్‌కు దక్కనున్నాయి. జనవరిలో ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్ జరగనుంది. అలాగే ఫిబ్రవరిలో ఐసిసి టి20 ప్రపంచకప్, జూన్‌లో మహిళల టి20 ప్రపంచకప్‌లు జరగనున్నాయి. ఈ మూడు టైటిళ్లను భారతజట్లు కైవసం చేసుకోవాలంటే పై సమస్యలన్నింటినీ అధిగమించాల్సి ఉంది. టి20 స్పెషలిస్ట్ బ్యాటర్‌గా పేరున్న సూర్యకుమార్ యాదవ్.. ఈ ఫార్మాట్‌లో సారథ్యం వహించిన అనంతరం బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమవుతున్నాడు. అతడు ఆ బాధ్యతలు చేపట్టకముందు రోహిత్ శర్మ కెప్టెన్సీలో ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. 2024 టి20 ప్రపంచకప్ ముందు వరకు సూర్యకుమార్ యాదవ్ భారతజట్టు అత్యుత్తమ టి20 బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలోనే ఐసిసి ర్యాంకింగ్స్‌లోనూ టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. ఆ అనుభవంతోనే అతడికి రోహిత్ రిటైర్మెంట్ తర్వాత బిసిసిఐ పగ్గాలు అప్పగించింది. 2024 జులైలో శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో జరిగిన సిరీస్‌లలో అతడు బ్యాటింగ్‌లో అదరగొట్టాడు. 2024 అక్టోబర్ 12న బంగ్లాదేశ్‌పై కేవలం 35బంతుల్లోనే 75పరుగులు చేశాడు. అందులో ఐదు సిక్సర్లు, ఎనిమిది ఫోర్లు ఉన్నాయి. ఆశ్చర్యకర విశేషమేమిటంటే ఈ ఫార్మాట్‌లో సూర్యకుమార్ యాదవ్ చివరిసారిగా అర్ధసెంచరీ కొట్టింది అప్పుడే. 2025లో సూర్యకుమార్ యాదవ్ మొత్తం 22 టి20 మ్యాచుల్లో కేవలం రెండుసార్లు మాత్రమే 25 పరుగుల స్కోర్‌ను దాటాడు. ఆసియాకప్‌లో పాకిస్తాన్‌పై అత్యధికంగా 47పరుగులు చేశాడు. మరో విశేషమేమిటంటే.. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా ఉన్న 7 సిరీస్‌లను టీమిండియా కైవసం చేసుకుంది. 2025లో టీమిండియా ఒక్కసారి కూడా ఈ ఫార్మాట్‌లో సిరీస్ ఓడిన దాఖలాలు లేవు. మరో 40రోజుల్లో టి20 ప్రపంచకప్ ప్రారంభం కానున్న దృష్ట్యా అతడు ఫామ్‌ను నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మిస్టర్ 360 డిగ్రీస్‌గా పేరున్న సూర్యకుమార్.. కెప్టెన్ అయ్యాక బ్యాటింగ్‌పై మరింత శ్రద్ధగా ఆడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ గత ఏడాది తీసుకున్న కొన్ని కీలక నిరయాలు అతనికి చెడ్డ పేరు తీసుకొచ్చాయి. గత ఏడాది ఆసియాకప్ సందరరేగా రాహుల్ ద్రావిడ్ నుంచి కోచ్ బాధ్యతలు అందుకున్న గంభీర్.. తొలిసారే జట్టుకు ఆసియాకప్ టైటిల్‌ను అందించాడు. 2025 ఆసియాకప్ టోర్నీ టి20 ఫార్మాట్‌లో జరగడం, దుబాయ్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగడం టీమిండియాకు కలిసొచ్చింది. అలాగే ఛాంపియన్స్ ట్రోఫీని రోహిత్ శర్మ సారథ్యంలో గౌతం గంభీర్ కోచ్‌గా ఉన్న దశలోనే కైవసం చేసుకుంది. ఈ రెండు టైటిళ్లను అందించడంతో గంభీర్ కోచ్‌గా సక్సెస్ అయ్యాడని అంతా అనుకున్నారు. అసలు కథ అప్పుడే మొదలైంది. ఛాంపియన్స్ ట్రోఫీని టీమిండియా చేజిక్కించుకున్న తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్టులకు గుడ్ బై చెప్పారు. ఆఘ మేఘాలమీద వీరిద్దరు టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పడానికి గల కారణాలేమిటో ఎవరికీ తెలియలేదు. గౌతమ్ గంభీర్ ప్రధాన కారణమని ఆ తర్వాత సామాజిక మాధ్యమాల్లో పలు విమర్శలు వెల్లువెత్తాయి. యువ క్రికెటర్లకు ప్రాధాన్యతనిచ్చే క్రమంలోనే వీరిద్దరి చేత సుదీరి ఫార్మాట్‌కు గుడ్‌బ్కెట చెప్పించాడని విమర్శలు గుప్పుమన్నాయి. 2025-27 డబ్ల్యుటిసి ఫైనల్‌కు టీమిండియా చేయాలంటే ఇంకా 9మ్యాచుల్లో కనీసం 6మ్యాచుల్లో గెలవాల్సి ఉంది. కనీసం 9టెస్టుల్లో 6గెలుపు, ఒక డ్రా, 2ఓటమితో 59.3%సగటుతో భారతజట్టు డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరే ఛాన్స్ ఉంది.

# 2027 వరల్డ్ కప్ తర్వాత వన్డేలు కనుమరుగయ్యే ముప్పు ఉంది: అశ్విన్



టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వన్డే క్రికెట్ భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌ల హవా పెరిగిపోతుండటంతో 50 ఓవర్ల ఫార్మాట్ క్రమంగా ప్రాభవం కోల్పోతోందని, 2027 ప్రపంచకప్ తర్వాత వన్డే క్రికెట్ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు.తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన అశ్విన్, "2027 ప్రపంచకప్ తర్వాత వన్డే ఫార్మాట్ భవిష్యత్తు ఎలా ఉంటుందోనని నేను కొంచెం ఆందోళన చెందుతున్నాను. అది నెమ్మదిగా అంతరించిపోయే దిశగా వెళుతోంది" అని అన్నాడు. ఆధునిక క్రికెట్ దిగ్గజాలైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి వాళ్లు రిటైర్ అయ్యాక ఈ ఫార్మాట్‌కు ఆదరణ మరింత పడిపోతుందని అభిప్రాయపడ్డాడు. "విజయ్ హజారే ట్రోఫీలో రోహిత్, కోహ్లీ ఆడటంతో ప్రజలు దాన్ని చూడటం మొదలుపెట్టారు. క్రీడ ఎప్పుడూ వ్యక్తుల కంటే గొప్పదే. కానీ, కొన్నిసార్లు ఫార్మాట్‌ను బతికించడానికి ఇలాంటి స్టార్ ఆటగాళ్లు అవసరం. ఒకవేళ వాళ్లు వన్డేలు ఆడటం మానేస్తే పరిస్థితి ఏంటి?" అని అశ్విన్ ప్రశ్నించాడు. కేవలం ఆదాయం కోసం ఐసీసీ తరచూ ప్రపంచకప్‌లు నిర్వహించడం వల్ల టోర్నమెంట్ విలువ తగ్గిపోతోందని విమర్శించారు.

వన్డే ఫార్మాట్‌ను బతికించాలంటే నాలుగేళ్లకోసారి ప్రపంచకప్ మాత్రమే నిర్వహించాలని ఆయన సూచించారు. "నిజంగా వన్డే క్రికెట్‌ను నిలబెట్టాలనుకుంటే, టీ20 లీగ్‌లతో పాటు నాలుగేళ్లకోసారి వరల్డ్ కప్ నిర్వహిస్తే సరిపోతుంది. అప్పుడే ఆ టోర్నమెంట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి, అంచనాలు ఉంటాయి" అని అశ్విన్ వివరించారు.




# కెరీర్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్న 'ఆలియాభట్'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ ఇప్పుడు తన కెరీర్‌లో మరో కొత్త దశను ఆస్వాదిస్తోంది. వరుసగా సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో టాప్‌లో కొనసాగుతున్న అలియా... తాజాగా తన పని తీరులో కీలక మార్పులు చేసుకుంటోంది. ఇప్పటివరకు ఒకేసారి రెండు మూడు సినిమాలు చేయడమే అలవాటుగా ఉన్న ఆమె, ఇకపై ఆ పద్ధతికి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఈ ఏడాది అలియా 'ఆల్ఫా', 'లవ్ అండ్ వార్' వంటి భారీ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తల్లిగా తన బాధ్యతలకు పూర్తి ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై అలియా స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అలియా, మాత ృత్వం తన జీవితాన్ని ఎలా మార్చిందో ఓపెన్‌గా మాట్లాడింది. "రాహా మా జీవితంలోకి వచ్చిన తర్వాత నా ప్రొఫెషనల్ లైఫ్ పూర్తిగా మారిపోయింది. బిడ్డను చూసుకోవాల్సిన బాధ్యత కారణంగా నా పనిలో సహజంగానే వేగం తగ్గింది. అయినా నేను చాలా సంత ృప్తిగా, సంతోషంగా ఉన్నాను" అని అలియా చెప్పింది.



ఇంతకుముందు లాగా ఒకేసారి రెండు మూడు సినిమాలకు సైన్ చేయడం ఇక సాధ్యం కాదని స్పష్టం చేసింది. "ఇప్పుడు ఒకే సినిమా చేస్తున్నాను. కానీ ఆ పాత్రకు వంద శాతం న్యాయం చేయాలని కోరుకుంటున్నాను. క్వాలిటీకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాను" అని అలియా వెల్లడించింది.

తల్లి అయిన తర్వాత యాక్షన్ సన్నివేశాలు చేయడం పెద్ద సవాలేనని కూడా అలియా అంగీకరించింది. ప్రస్తుతం తాను నటిస్తున్న 'ఆల్ఫా' సినిమాలో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో పాల్గొంటున్నట్లు చెప్పింది. "బిడ్డ పుట్టిన తర్వాత ఇలాంటి యాక్షన్ సీన్స్ చేయడం నాకు కొత్త అనుభూతిని ఇచ్చింది. నా శరీరం ఎంత శక్తివంతంగా ఉందో నాకు నేనే తెలుసుకున్నాను. నా శరీరంపై గౌరవం మరింత పెరిగింది" అని చెప్పుకొచ్చింది.

మొత్తానికి అలియా భట్ ఇప్పుడు కెరీర్, కుటుంబం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తూ ముందుకెళుతోంది. తల్లిగా మారిన తర్వాత కూడా తనలోని నటిని మరింత బలంగా తీర్చిదిద్దుకుంటూ, సినిమాల్లో కొత్త ఛాలెంజ్‌లకు సిద్ధమవుతున్న అలియా నిర?యం అభిమానుల్లో ప్రశంసలు అందుకుంటోంది.

# 'అనగనగా ఒక రాజు' చిత్రంతో సరికొత్త పాత్రలో నవీన్ పొలిశెట్టి

టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ నవీన్ పొలిశెట్టి మరోసారి తన టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యాడు. ఆయన హీరోగా, మీనాక్షి చౌదరి కథానాయికగా కల్యాణ్ శంకర్ తెరకెక్కించిన 'అనగనగా ఒక రాజు' చిత్రం ఈ సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేట ర్లలోకి రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచార వేడుకలో నవీన్ తన పెళ్లి నుంచి కెరీర్ స్ట్రగు ల్స్ వరకు పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే నవీన్ పెళ్లి అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన అదిరిపోయే పంచ్ ఇచ్చాడు. "ప్రభాస్ అన్నయ్య పెళ్లి చేసుకున్న మరుసటి రోజే.. కరెక్ట్‌గా 12 గంటల తర్వాత నేను కూడా వివాహం చేసుకుంటా" అంటూ నవ్వులు పూయించాడు.



వరుస హిట్లతో దూసుకుపోతున్న నవీన్.. ఈ చిత్రంలో తనను తాను కొత్తగా ఆవిష్కరించుకున్నట్లు తెలిపారు. "ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ దగ్గర నుంచి 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వరకు నేను చేసిన ప్రతి పాత్ర భిన్నమైనదే. ఇప్పుడు ఈ సినిమాలో గోదావరి జిల్లాల వెటకారం కలగలిసిన కొత్త తరహా పాత్రలో కనిపిస్తా. ఇది చూస్తున్నప్పుడు నా పాత సినిమాలు ఏవీ మీకు గుర్తుకు రావు" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సంక్రాంతికి పెద్ద సినిమాల పోటీపై స్పందిస్తూ.. "మెగాస్టార్ చిరంజీవి మాలాంటి ఎందరో మధ్యతరగతి కుర్రాళ్లకు స్ఫూర్తి.. ఆయన బాటలోనే మేము ఇక్కడి వరకు వచ్చాం. గురువుగారి సినిమాతో పాటు మా సినిమా రావడం ఒత్తిడిని కాదు, ఉత్సాహాన్ని ఇస్తుంది" అని చెప్పాడు. ముంబైలో పెళ్లిళ్లకు హోస్ట్‌గా పనిచేసిన గతాన్ని గుర్తు చేసుకుంటూ.. కష్టపడి పైకి వచ్చిన ప్రయాణమే తనను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టిందని నవీన్ పొలిశెట్టి భావోద్వేగానికి లోనయ్యాడు.




# మహిళలను మానసిక క్షోభకు గురిచేసే త్రివిక్రమ్
## పూనమ్ కౌర్ కీలక వ్యాఖ్యలు

ప్రముఖ సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ఉద్దేశించి నటి పూనమ్ కౌర్ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన ఆరోపణలు చేశారు. ఆయన మహిళలకు తీవ్రమైన మానసిక క్షోభను మిగిల్చే ఒక "దుర్మార్గుడు" అని, ఎలాంటి పరిణామాలు ఎదుర్కోకుండా తప్పించుకోగలుగుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనికి కొన్ని మీడియా సంస్థలు, 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) వంటి పరిశ్రమ సంఘాలు అండగా నిలవడమే కారణమని ఆమె ఆరోపించారు. మె చేసిన ఈ పోస్ట్, టాలీవుడ్‌లో చాలాకాలంగా ఉన్న వివాదాన్ని మళ్ళీ తెరపైకి తెచ్చింది. 2001లో వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్' సినిమా రీ-రిలీజ్ ప్రమోషన్‌లో భాగంగా దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడిన వీడియోపై పూనమ్ స్పందించారు. ఆ వీడియోలో త్రివిక్రమ్.. డబ్బు, కీర్తి కంటే గౌరవాన్ని తెచ్చిపెట్టే సినిమాల గురించి తాత్వికంగా మాట్లాడారు. దీనిపై స్పందిస్తూ పూనమ్ , "ఆయనో దుర్మార్గుడు. మహిళలను మానసిక క్షోభకు గురిచేసి ఏమీ ఎరగనట్టు వెళ్ళిపోగలడు. ఎందుకంటే మీలాంటి మీడియా సంస్థలు, 'మా' అసోసియేషన్ అతనికి మద్దతిస్తున్నాయి. అతని లాంటి వారిని జవాబుదారీ చేయకుండా వదిలేస్తున్నాయి," అని పోస్ట్ చేశారు. ఇలాంటి వ్యక్తులు మహిళలను వేధిస్తూ వారిని మానసికంగా కుంగదీస్తున్నారని, చిన్న చిన్న విషయాలకు



స్పందించే 'మా' అసోసియేషన్ ఇలాంటి తీవ్రమైన అన్యాయాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గత కొన్నేళ్లుగా పూనమ్ కౌర్, త్రివిక్రమ్‌పై ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. త్రివిక్రమ్ చర్యల వల్లే తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితం కూడా దెబ్బతిన్నదని, వ ృత్తిపరంగా, రాజకీయంగా నష్టపోయానని ఆమె గతంలో పలుమార్లు ఆరోపించారు. త్రివిక్రమ్‌కు అత్యంత సన్నిహితుడైన నటుడు, రాజకీయ నాయకుడు పవన్ కల్యాణ్ గురించి కూడా ఆమె కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

Edited, Printed, Published & Owned by LEKKALA SREENU and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem, VISAKHAPATNAM, AP-530049 and Printed at Guddapuvalasa Ramani, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082